# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 119 | హైదరాబాద్ | మంగళవారం 28-10-2025 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

ఏం.. మీరు న్యూస్ పేపర్లు చదవడంలేదా?... వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు ఫైర్

## నేటి భారతం

- మనిషి ఏ పని చేసినా.. అవసరానికి సరిపడా డబ్బు కోసమే కదా..
- ఆకలి తీర్చుకోవడానికి అన్నం కోసమే కదా.. ఇంతకు మించి ఇంకేం కావాలి..
- కీర్తి ప్రతిష్టలు కావాలనుకుంటే మీకున్న దాంట్లో ఎదుటివారికి సహాయం చేయవచ్చు...
- అది శారీరకంగా నైనా మానసికంగా నైనా లేదా ఇంకే రూపాన అయినా సరే..
- కానీ ఈ లోకంలో చాలామంది అవసరానికి మించి సంపాదిస్తున్నారు.. సరే అది వారి ఇష్టం వారి కష్టం అనుకుందాం..
- ఎదుటివారికి సహాయం చేయడం చేయకపోవడం అన్నది వారి విజ్ఞతకు వదిలేద్దాం..
- కానీ ఇక్కడ సమస్య ఏమిటంటే.. ఆ సంపాదన అవినీతి సంపాదన కావడం దురదృష్టకరం..
- ఎదుటివారికి సహాయం చేయకపోయినా పర్వాలేదు.. కానీ ఎదుటివారిని పీడించి సంపాదించడం ఎంతవరకు సమంజసం..?
- అసలు ఏమి చేసుకుంటారు ఈ సంపాదనను.. మీరు పోయినప్పుడు తీసుకుని పోలేరు..
- ఏదైనా అనారోగ్యం పాలైతే కనీసం తినడానికి కూడా మీకు వీలుపడదు.. ఇవన్నీ తెలుసు కదా మరెందుకు ఇంత నీచంగా ప్రవర్తిస్తూ ఉంటారు...
- దేవుడిచ్చిన దాంట్లో పదిమందికి సహాయం చేయండి.. మీరు చనిపోయిన తర్వాత కూడా వారి హృదయాల్లో బ్రతకండి..

– బోయినపల్లి రమణా రావు,
సీనియర్ జర్నలిస్ట్..

## హైదరాబాద్ శివార్లలో 100 ఎకరాల్లో భారీ గోశాల

### రూ. 157 కోట్లు మంజూరు


11లో

- రంగారెడ్డి జిల్లా ఎన్కేపల్లిలో స్థలం కేటాయింపు
- భూమిని నమ్ముకున్న 40 కుటుంబాలకు పునరావాసం, ఉద్యోగ హామీ
- భూమిని స్వాధీనం చేసుకున్న హెచ్ఎండీఏ.. టెండర్ల ప్రక్రియ ప్రారంభం



## వాహనాలకు స్టార్ రేటింగ్..

### పిల్ తిరస్కరించిన సుప్రీంకోర్టు

- వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు వాహనాలకు స్టార్ రేటింగ్
- పిల్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు
- ఇది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని స్పష్టం చేసిన ధర్మాసనం
- కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వాలని పిటిషనర్‌కు సూచన

11లో

## కేటీఆర్ జాగ్రత్తగా ఉండాలని స్వయంగా కవితనే హెచ్చరించారు

- కాళేశ్వరం ప్రాజెక్టులో హరీశ్ రావు, సంతోష్ రావు దోచుకున్నారని కవిత చెప్పారన్న మంత్రి
- కాళేశ్వరం అవినీతి అంశంలో రామన్న జాగ్రత్తగా ఉండాలని కవిత అన్నారని వ్యాఖ్య
- కేటీఆర్ తనస్థాయి వ్యక్తి కాదన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి


11లో

## ఆధార్ కార్డుకు సంబంధించి నవంబర్ 1నుంచి మారనున్న రూల్స్



11లో

- అడ్రస్ మారాలంటే ఆధార్ కేంద్రానికి వేళ్లనక్కర్లేదట
- పేరు, మొబైల్ నెంబర్ కూడా మార్చేసుకోవచ్చు
- ఇంట్లో నుంచే ఆన్ లైన్ లో మార్పులు చేసుకోవచ్చని అధికారుల వెల్లడి




## 6 వేల కుటుంబాలకు ఆరోగ్య భరోసా..

11లో

- తిరుపతిలో ఆర్టీసీ ఉద్యోగుల కోసం కొత్త వైద్యశాల నిర్మాణం
- ఈ నెల 30న ప్రారంభించనున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి
- దాదాపు 6 వేల ఉద్యోగుల కుటుంబాలకు అందనున్న ఉచిత వైద్యం
- రూ.3.89 కోట్ల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో భవనం

## ఎల్బీనగర్లో...

- సరైన నియంత్రణ లేకపోవడంతో రెచ్చిపోతున్న వైనం..
- లంచాలకు బానిసలై పోతున్న ఆరోగ్యశాఖ అధికారులు..
- వీరికి వంత పాడుతున్న జిహెచ్ఎంసి అవినీతి అధికారులు..
- అనుమతులు లేకుండా నడుస్తున్న ఎన్నెన్నో ఆసుపత్రులు..
- ఎలాంటి సేఫ్టీ ప్రికాషన్స్ లేకుండానే ఆసుపత్రుల నిర్వహణ..
- ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ ఇష్టానుసారం భారీ ఫీజులు వసూలు చేస్తున్న దుర్మార్గం..
- అక్రమ నిర్మాణాలలో, భవంతుల్లో నిర్వహిస్తున్న ఆసుపత్రులు..
- కేవలం దోపిడీయే తమ ఎజెండాగా సాగిపోతున్న ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు...
- ప్రాణాలు పోయినవారికి సైతం వైద్యం నిర్వహిస్తున్నామని లక్షల్లో దోచుకున్న ఉదంతాలు ఎన్నెన్నో..
- ఈ దోపిడిపై యుద్ధాన్ని ప్రకటిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..

12లో

## ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీ..





11లో

## తుపాను బాధితులకు రూ.3 వేలు, 25 కిలోల బియ్యం

- మొంథా తుపానుపై కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం చంద్రబాబు సమీక్ష
- అన్ని పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశం
- తుపాను సహాయక చర్యలు భవిష్యత్‌కు ఆదర్శంగా ఉండాలన్న సీఎం

# సంపాదకీయం

## వాయుగుండాలు

ప్రపంచంలోనే అతి పెద్ద తీరప్రాంతం బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉంది. సుమారు 50 కోట్ల మంది ఈ తీర ప్రాంతంలో నివసిస్తున్నారు. అలాగే ప్రపంచ చరిత్రలో అత్యంత ఘోరమైన తుపానుల్ని ఎదుర్కొంటోంది కూడా ఈ తూర్పు తీర ప్రాంతమే. వాతావరణ వివరాలను అందించే వెబ్ సైట్ వెదర్ అండర్ గ్రౌండ్‌లో ఈ తీరానికి సంబంధించి కొన్ని ఆసక్తికర వివరాలున్నాయి. ప్రపంచ చరిత్రలో అత్యంత ఘోరమైన 35 తుపానుల్లో 27 పెను తుపాన్లు ఈ తీరంలోనే సంభవించాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఘోరమైన తుపానులన్నీ బంగాళాఖాతంలోనే సంభవిస్తుంటాయని చెబుతారు వాతావరణ పరిశోధకులు. ఇక్కడ లోతు తక్కువగా ఉంటూ ఒక వైపుకు తీర ప్రాంతం వంగినట్లు ఉండి పల్లంగా ఉంటుంది. సాధారణంగా తుపాను సమయంలో వీచే బలమైన గాలులు నీటిని బలంగా ఒడ్డువైపుకు తోస్తాయి. ఫలితంగా అలల వేగం ఒక్కసారిగా పెరిగి నేరుగా తుపాను తీరాన్ని తాకుతుంది. బంగాళాఖాతం ఉపరితలంలో ఉష్ణోగ్రతలు ఎప్పుడూ అధికంగా ఉండటం కూడా ఈ పరిస్థితికి ఒక కారణం. ఫలితంగా తీవ్ర తుపానులు సంభవిస్తుంటాయి. "అక్కడ ఉష్ణోగ్రతల స్థాయి చాలా ఎక్కువ" అని భారత వాతావరణ పరిశోధన విభాగ అధిపతి డి. మహాపాత్ర వ్యాఖ్యానించారుప్రపంచవ్యాప్తంగా ఈ తరహా పెను తుపానులు సంభవించే మరికొన్ని తీర ప్రాంతాలు కూడా ఉన్నాయి. అందుకు ఉదాహరణ లూసియానాలోని గల్ఫ్ తీర ప్రాంతం."కానీ బంగాళాఖాతపు ఉత్తర తీర ప్రాంతంలో తుపానులు ఒక్కసారిగా విరుచుకుపడి పెను నష్టానికి కారణమవుతాయి. భూమిమీద ఇంకెక్కడా ఇంత దారుణమైన పరిస్థితులు తలెత్తవు" అని హెన్సన్ అన్నారు. తూర్పు తీర ప్రాంతంలో జనసాంద్రత అధికంగా ఉండటం కూడా తీవ్ర నష్టానికి కారణమవుతోంది. ఇక ప్రపంచవ్యాప్తంగా ప్రతి నలుగురిలో ఒకరు తీర ప్రాంతాల్లోనే ఉంటున్నారు. తుపానుల వల్ల అనేక విపత్తులు ఎదురవుతాయి. బలమైన గాలుల కారణంగా భౌతిక నష్టం ఎక్కువగా ఉంటుంది. అలాగే సముద్రంలో అలల పోటు తీవ్రంగా ఉంటుంది ఈ రెండింటితో పాటు భారీ వర్షాలు జన జీవనాన్ని అస్తవ్యస్థం చేస్తాయి. సాధారణంగా బంగాళాఖాతంలోనూ, అరేబియా సముద్రంలో తరచూ తుపానులు వచ్చినా ప్రతి పదేళ్లకు ఒకసారి మాత్రమే ఈ స్థాయి తుపానులు విరుచుకుపడుతుంటాయి. మన భారతదేశ భౌగోళిక స్వరూప దృష్ట్యా మనం ఈ తూఫాన్లను చూస్తూ ఉంటాం. సాధారణంగా ఇవి భూమధ్య రేఖకు 500 కిమీ నుండి 25000 కిమీ ల మధ్య మాత్రమే ఏర్పడతాయి. అందుకే వీటిని మనం ఉష్ణ మండల తూఫాను గా సంబోధిస్తాము. తూఫాను అన్నది సముద్ర జలాల పై ఏర్పడే అల్ప పీడన ప్రాంతమే. కానీ ఇక్కడ కేంద్రం చుట్టూ ఉన్న ఎన్విరాన్మెంట్ కన్నా వెచ్చగా ఉండి అపసవ్య గడియార దిశలో తిరుగుతూ ఉంటుంది. ఇక్కడ నేను అతి తక్కువ శాస్త్రీయ పదాలు ఉపయోగించి అందరికీ అర్థం అయ్యేలా రాయడానికి ప్రయత్నిస్తాను. తూఫాను ఏర్పడడానికి ముందు కచ్చితంగా ఈ క్రింద తెలపడిన అంశాలు ఉండి తీరాలి. ముందుగా సముద్ర ఉపరితల జల ఉష్ణోగ్రత కచ్చితంగా 26.5 డిగ్రీ సెంటిగ్రేడ్ కన్నా ఎక్కువ ఉండాలి. సముద్ర వాతావరణం గా ఉండాలివాతావరణ మధ్య పొరలలో ఎక్కువ ఆర్ద్రత లభించాలి. కరియోలిస్ ఫోర్స్ (ఇది తూఫాను అపసవ్య గడియార దిశలో తిరిగేందుకు)

ఒక దృఢమైన వాతావరణ అలజడి (అల్ప పీడన ప్రాంతం)ఎప్పుడైతే పైన తెలుపబడిన అంశాలు వాతావరణం లో లభ్యమవుతాయో అప్పుడు ఒక అల్ప పీడనం తూఫాను గా రూపాంతరం చెందడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయి. ముందుగా వెచ్చని తేమతో కూడిన సముద్ర ఉపరితల గాలులు వాతావరణ పై పొరలలోకి వెళ్ళేటప్పుడు తక్కువ సాంద్రత కలిగిన గాలిని క్రింది వాతావరణ పొరల్లో వదిలేస్థాయి. కాబట్టి అక్కడ అల్ప పీడన ప్రాంతం ఏర్పడుతుంది. ఎప్పుడయతే ఈ అల్ప పీడన ప్రాంతం ఏర్పడిందో, దానికి చుట్టూ ఉన్న గాలి ఆ ప్రాంతం లోకి వచ్చి అది కూడా తేమను సంగ్రహించి పై పొరలలో కి వెళ్తుంది. ఈ ప్రక్రియ అలా జరుగుతూ ఉంటుందిఎప్పుడైతే ఈ వెచ్చనైన తేమతో కూడిన గాలి పై పొరలలో చల్లర్చబడినదో, వెంటనే మేఘాలు ఏర్పడుతాయి. ఆ పై సముద్ర ఉష్ణ శక్తి మరియు ఉష్ణ ఎవోపోరేషన్ దోహదపడి, కారియోలిస్ ఫోర్స్ కారణంగా ఈ మేఘాలు అప గడియార దిశలో తిరగడం ప్రారంభిస్తాయి. ఈ మేఘాలు, వాతావరణ అనుకూల స్థితుల దృష్ట్యా మరింత వేగం గా తిరుగుతాయి. ఇలా తిరగడం వలన ఉపరితల గాలుల తీవ్రత అధికంగా ఉంటాయి. ఈ ఉపరితల గాలులు (10ఎ ఎత్తు వద్ద) ఎప్పుడైతే 34 నాట్స్ (1 నాట్ = 0.514 ఎ/బ) చేరతాయో అప్పుడు ఆ వాతావరణ స్థితిని తూఫాను గా ప్రకటిస్తారు. ఈ గాలుల తీవ్రత నిర్దిష్ట పరిమితి దాటిన తర్వాత వాటి యొక్క స్థాయిని వాతావరణ శాఖ వారు వేరు వేరు స్టేజ్ లుగా ప్రకటిస్తారు. ఉష్ణ మండల తూఫాను (34 నుండి 47 నాట్స్ వరకు)తీవ్ర తుఫాను (48 నుండి 63 నాట్స్ వరకు)అతి తీవ్ర తుఫాను (64 నుండి 89 నాట్స్ వరకు)అత్యంత తీవ్ర తుఫాను (90 నుండి 119 నాట్స్ వరకు)మహా తూఫాను (120 నాట్స్ నుండి)ఈ తుఫాను ఎప్పుడైతే భూ భాగం పై కి వస్తుందో (ఈ పక్రియ ను తీరం దాటడం గా అభివర్ణిస్తారు) అప్పుడు ఈ భీకర ఉపరితల గాలులు మరియు అతి భారీ వర్షాల వల్ల తీవ్ర నష్టం కలిగిస్తుంది. అయితే తీరం దాటిన తరువాత నీటి లభ్యత లేక ఇవి క్రమేపీ వాటి తీవ్రతను కోల్పోతూ చివరకు నశిస్తాయి. 1970 నవంబర్లో వచ్చిన సైక్లోన్ భోలా ప్రపంచ చరిత్రలోనే అత్యంత ఘోరమైన తుపానుల్లో ఒకటి. బంగాళాఖాతంలో సంభవించిన ఈ తుపాను కారణంగా సుమారు 50 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ తుపాను సమయంలో తీర ప్రాంతంలో అలలు సుమారు 34 అడుగుల ఎత్తున ఎగసిపడ్డాయి. గడిచిన కొన్ని దశాబ్దాలుగా బంగాళాఖాతంలో సంభవించే తుపానుల తీవ్రత పెరుగుతూ వస్తోంది. 2008 మే నెలలో బర్మా తీరంలో సంభవించిన 'నర్గిస్' తుపాను కారణంగా సుమారు లక్షా 40 వేల మంది ప్రాణాలు కోల్పోగా, 20 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. చివరిసారిగా 1999లో సూపర్ సైక్లోన్ భారత్‌లో ఒడిశా రాష్ట్రాన్ని తాకింది. ఆ తుపాను ధాటికి సుమారు 10 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఎటు చూసినా కుళ్లిన శవాలు, శ్మశానాల్లో ఆకాశాన్ని అంటుతున్న పొగ.. అప్పట్లో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రయాణించిన నాకు కనిపించిన దృశ్యాలవి. నాటి భయానక పరిస్థితి ఇప్పటికి నాకు గుర్తుంది. ఓ సూపర్ సైక్లోన్ ధాటికి పరిస్థితులు ఎంత దారుణంగా తయారవుతాయో మొదటిసారిగా అప్పుడే తెలిసింది

# కాకినాడ నుంచి నక్కపల్లికి బల్క్ డ్రగ్స్

విజయనగరం, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 27: మన దేశ ఔషధ రంగ భవిష్యత్‌ను పూర్తిగా మార్చే సత్తా ఉన్న మెగా ప్రాజెక్టు ఈ బల్క్‌డ్రగ్ పార్క్. కరోనా సమయంలో ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కేంద్రం వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. కోవిడ్ టైంలో అసలు మాస్క్‌లను కూడా భారీగా ఉత్పత్తి చేయలేని మన వైద్యరంగం ఉండేది. భవిష్యత్‌లో వైద్యపరంగా ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు కేంద్రం ప్రత్యేక ప్రణాళికలు రచించింది. అందులో భాగంగా దేశంలో అతి పెద్ద బల్క్‌డ్రగ్ పార్క్‌లను ఏర్పాటు చేయాలని భావించింది. దీని కోసం దేశంలోని అనేక రాష్ట్రాలు పోటీ పడ్డాయి. కానీ మూడు రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు నచ్చిన కేంద్రం వారికి ఆ అవకాశం కల్పించింది. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌లో ఈ డ్రగ్‌పార్క్‌లు ఏర్పాటుకు అంగీకరించింది. ఏడాదిన్నర లోపు ఈ డ్రగ్ పార్క్ మొదటి విడత ప్రారంభించాలనే లక్ష్యంతో పనులు ప్రారంభించారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో అనేక అవాంతరాలు కారణంగా ఇప్పటి అనుకున్న లక్ష్యం చేరుకోలేకపోయింది. ఈ ప్రాజెక్టు చేజారిపోకుండా వచ్చే మార్చి నాటికి మొదటి విడత పూర్తి చేస్తామని ప్రభుత్వం ఫైనల్ గడువు ఇచ్చి పనులు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన బల్క్ డ్రగ్స్ పార్క్‌ను విశాఖపట్నం సమీపంలోని నక్కపల్లి వద్ద ఏర్పాటుకు ప్రభుత్వాలు అంగీకరించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో దీన్ని దాదాపు 2000 ఎకరాల విస్తీర్ణంలో 1876 కోట్ల తో దీన్ని నిర్మించనున్నారు. ఇది కేవలం ఔషధాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యానికి ఇది ప్రతిబింబం. ఈ ప్రాజెక్టు ప్రస్తుత పురోగతి, దాని ప్రత్యేక విలువ, భారతీయ ఫార్మా పటంలో నక్కపల్లిని నిలపనున్నాయి. బల్క్‌డ్రగ్ పార్క్ అంటే చాలా మందికి ఒక పెద్ద ఫ్యాక్టరీ లేదా ఫార్మా సిటీలా అనిపిస్తుంది. కానీ దాని ప్రాముఖ్యత అంతకు మించి ఉంటుంది. అసలు మెడిసిన్ పని చేయడానికి గల ప్రధాన కారణం అందులో ఉండే బల్క్‌డ్రగ్ లేదా యాక్టివ్‌ఫార్మస్యూటికల్ ఇంగ్రిడియంట్. ఒక టాబ్లెట్‌లో మందు చాలా తక్కువ మోతాదులో ఉంటుంది కానీ ఆ టాబ్లెట్ ఆకారం, రుచి, అన్ని వాతావరణాలకు తట్టుకునేలా ఉండేందుకు మరికొన్ని పదార్థాలు కలుపుతారు. ఈ బల్క్‌డ్రగ్స్‌ను పెద్ద ఫ్యాక్టరీలలో రసాయనిక చర్యల



ద్వారా తయారు చేస్తారు. వాటిని శుద్ధి చేసి, నాణ్యత పరీక్షించిన తర్వాతే, మందులు తయారు చేసే కంపెనీలకు పంపిస్తారు. ఈ కంపెనీలకు ఫార్ములేషన్ ప్లాంట్స్ అంటారు. ఈ ఫార్ములేషన్ ప్లాంట్స్‌లో ఈ బల్క్ డ్రగ్స్‌ను ఇతర పదార్థాలతో కలిపి టాబ్లెట్లు, సిరప్‌లు క్యాప్సూల్స్‌గా మారుస్తారు. ఈ బల్క్ డ్రగ్స్ లేకపోతే మెడిసిన్ తయారు చేయడం అసాధ్యం. అందుకే, ఈ కీలకమైన ముడి పదార్థాల ఉత్పత్తిని ఒకే చోట కేంద్రీకృతంచేసి, అత్యాధునిక మౌలిక వసతులతో ఏర్పాటు చేసేదే బల్క్ డ్రగ్ పార్క్. నక్కపల్లిలో ఈ భారీ ప్రాజెక్టును ఇప్పుడే ఎందుకు ఏర్పాటు చేస్తున్నారనే ప్రశ్న వస్తుంది. దీనికి ప్రధాన కారణం కోవిడ్. 2019లో కరోనా మహమ్మారికి ముందు వరకు, భారతదేశం తన బల్క్ డ్రగ్ అవసరాలలో అధిక భాగాన్ని చైనా నుంచి దిగుమతి చేసుకునేది. అయితే కోవిడ్ సమయంలో చైనా నుంచి దిగుమతులు పూర్తిగా తగ్గిపోవడం, సరఫరా చైన్ తెగిపోవడం వల్ల మనం దేశం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. ఈ సంక్షోభమే తర్వాతే, మన దేశంలోనే ఎందుకు బల్క్ డ్రగ్స్ ఉత్పత్తి చేయకూడదు అనే ఆలోచనకు భారత్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పార్క్ నక్కపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో భాగం. ఇది విజయవాడ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, విశాఖపట్నం-కాకినాడ పెట్రోలియం, కెమికల్ అండ్ పెట్రోకెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌లో ఉంది. రాజయ్యపేట, బుచిరాజుపేట, చందనాడ, వెంపాడు, డోనివాని లక్ష్మీపురం గ్రామాల్లో విస్తరించి ఉంది. ఈ డ్రగ్స్ పార్క్ కోసం సౌత్ ఇండియాలో చాలా రాష్ట్రాల్లో తీవ్రంగా పోటీ పడ్డాయి. మొదట్లో ఈ పార్కును కాకినాడలో ఏర్పాటు చేయాలని భావించారు. నక్కపల్లి వద్ద భూమి సిద్ధంగా ఉందని అక్కడికి తరలించారు. నక్కపల్లిలో ఈ పార్క్ ఏర్పాటు చేయడానికి చాలా కారణాలు ఉన్నాయి. రవాణా సౌకర్యం:- నేషల్ హైవేకు 16కు కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది.

రైల్వే కనెక్టివిటీ కూడా ఐదు నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఎగుమతి దిగుమతులకు ఈ రైలవే లైన్ ఉపయోగపడుతుంది. పోర్టులు కూడా దగ్గరే:- గంగవరం పోర్టుకు చాలా దగ్గరగా ఉంది. విశాఖపట్నం పోర్టుకు 70 కిలోమీటర్లు, కాకినాడ పోర్టుకు 60 కిలోమీటర్ల దూరంలో ఉండటం దీనికి ఉన్న ప్రత్యేకత. వీటి కారణంగా ఉత్పత్తులు, ముడిసరకులు రవాణా మరింత సులభం అవుతుంది.

విద్యుత్ఊ నీటి సౌకర్యాలు:- పారిశ్రామిక అవసరాల కోసం ప్రత్యేకమైన ఇండస్ట్రీయల్ పవర్ గ్రిడ్ ఉంది. భవిష్యత్‌లో పునరుత్పాదక ఇంధనం వనరులను కూడా దీనికి అనుసంధానం చేస్తారు. రసాయన పరిశ్రమలకు అత్యవసరమైన నీటి సరఫరా కోసం ఏలూరు కాలువ ఉండనే ఉంది.

ఫార్మా ఎకో సిస్టమ్:- ఈ ప్రాంతానికి సమీపంలోనే ఉన్న హెటెరో దివిస్ ల్యాబ్స్, లాల్స్ ల్యాబ్స్ వంటి ప్రముఖ ఫార్మా కంపెనీలు ఇప్పటికే ఉన్నాయి. ఇవి ఈ బల్క్ డ్రగ్స్ పార్క్‌లో కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. నక్కపల్లి ప్రాజెక్ట్ ఖర్చు ?1,876.66 కోట్లుగా అంచనాలు వేస్తున్నారు. జనవరి 2024లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం ?1000 కోట్ల గ్రాంట్ అందిస్తోంది, మార్చి 2023లో మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ ?225 కోట్లు విడుదల కూడా చేసింది. ఈ బీపీడీ మూడు ప్యాకేజీలుగా విభజించారు. వాటికి టెండర్లు పిలిచారు. వర్క్ నడుస్తున్నాయి. ప్యాకేజీ 1లో రోడ్లు, డ్రైన్లు, సరిహద్దు గోడలు, గ్రీన్ ఏరియా డెవలప్‌మెంట్, నీటి సరఫరా, రీసైకిల్ వాటర్ సరఫరా, వేస్ట్ వాటర్ సిస్టమ్, పవర్ సప్లై, ఎమర్జెన్సీ, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, ట్రక్ టెర్మినల్స్, మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ వంటి పనులు ఉంటాయి. ప్యాకేజీ 2లో కామన్ ఎఫ్లియెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్, మెరిన్ అవుట్‌ఫాల్ సిస్టమ్ ఈ పనులు వ్యర్థ జలాలు శుద్ధి చేసి పర్యావరణానికి హాని కలగకుండా చూస్తారు. ప్యాకేజీ 3లో స్టీమ్ జనరేషన్, డిస్ట్రిబ్యూషన్, కామన్ సాల్వెంట్ రికవరీ సిస్టమ్ పనులు పూర్తి చేస్తారు.

**శరవేగంగా పనులు**

ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎనహెచ్ 16 నుంచి ఎన్ఐఏకు 4.5 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్ నిర్మాణాన్ని ప్రారంభించింది. పార్క్ కోసం సేకరించిన రెండు వేల ఎకరాల భూమి మొత్తం ఏపీఐఐసీ ఆధీనంలో ఉంది. భవిష్యత్ విస్తరణ కోసం అదనంగా 723.2 ఎకరాలు కేటాయించారు. ఇందులో పరిశ్రమలకు 1900 ఎకరాలను కేటాయిస్తారు. సౌకర్యాల కోసం 70 ఎకరాలు ఇస్తారు. పార్కింగ్, లాజిస్టిక్ అవసరాల కోసం 120 ఎకరాలు, మిగిలిన భూమిని యుటిలిటీలు, ఓపెన్ స్పేస్, వాటర్ బాడీ, గ్రీన్ బెల్ట్, రోడ్ల కోసం కేటాయిస్తారు. మొత్తం సేకరించిన భూమిలో కేవలం 57.90 శాతం విక్రయించడానికి వీలుగా ఉంటే మిగిలిన ప్రాంతాన్ని యుటిలీలు, ఓపెన్ స్పేస్, రోడ్లకు కేటాయిస్తారు. బల్క్ డ్రగ్ ఉత్పత్తి ఖర్చులు తగ్గించి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు అందించి ప్రపంచ స్థాయి పెట్టుబడిదారులను ఆకర్షించడం దీని ముఖ్య ఉద్దేశం. ఇక్కడ పెట్టుబడిదారులు కోర్ ఉత్పత్తిపై దృష్టి పెడతారు. ఇది పెట్టుబడి, ఆపరేటింగ్ ఖర్చును 15-20 శాతం వరకు తగ్గిస్తుంది. అంతే కాకుండా 2033-34 నాటికి 27 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తుంది.

## దటీజ్ చంద్రబాబు
# 70ఏళ్ల వయస్సులో చాలెంజ్

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 27: 10 సంవత్సరాల వయసులో ఉన్న ఉత్సాహం 20 సంవత్సరాల వయసులో ఉండదు. ఇలా వయసు మారుతున్న కొద్దీ మనుషులలో మార్పులు వస్తుంటాయి. ఇది సహజంగా జరిగే ప్రక్రియే. కానీ కొంతమంది వయసు వెనక్కి పంపించేస్తుంటారు. తమ ఉత్సాహం ముందు.. తమ క్రమశిక్షణమందు వయసును చిన్నబోయేలా చేస్తారు. అటువంటి వారిలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒకరు. వాస్తవానికి ఈ జాబితాలో చంద్రబాబు నాయుడు కు మొదటి స్థానం ఇవ్వాల్సి ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడుల కోసం నాడు చంద్రబాబు నాయుడు అనేక దేశాలు తిరిగారు. మైక్రోసాఫ్ట్ అనే సంస్థను హైదరాబాద్ తీసుకొచ్చారు. మైక్రోసాఫ్ట్ ద్వారా ఐటీకి ఒక ఎకో సిస్టం డెవలప్ చేశారు. ఈరోజు హైదరాబాద్ ఐటి విభాగంలో ఈ స్థాయిలో అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణం చంద్రబాబు నాయుడు అనడంలో ఎటువంటి అనుమానం అక్కర్లేదు. ఈ విషయాన్ని అనేకమంది ముఖ్యమంత్రులు.. అనేకమంది నాయకులు ఒప్పుకున్నారు. చంద్రబాబు నాయుడు మొదటినుంచి కూడా ఆహారం తీసుకునే విషయంలో కట్టుదిట్టంగా ఉంటారు. ఏమాత్రం దానిని బ్రేక్ చేయరు. ఆయనకు ఎంతో కాలం నుంచి మధుమేహం ఉంది. అయినప్పటికీ అయినప్పటికీ దానిని నియంత్రణలో ఉంచుకుంటున్నారు. చంద్రబాబు ఎట్టి పరిస్థితుల్లో కూడా అన్నం తినరు. కేవలం తృణధాన్యాలను మాత్రమే ఆహారంగా తీసుకుంటారు. కాఫీ తాగుతారు. గ్రిల్డ్ ఫిష్ తీసుకుంటారు. నాన్ వెజ్ విషయంలో ఆయనకు చాలా లెక్కలు ఉంటాయి. ప్రతిరోజు ఉదయం వ్యాయామం చేస్తారు. యోగా చేస్తారు. మెడిటేషన్ కూడా చేస్తారు. అందువల్ల చంద్రబాబు ఏడుపదుల వయసు దాటినప్పటికీ కూడా ఉత్సాహంగా కనిపిస్తుంటారు. ప్రతి విషయాన్ని కూడా గుర్తుంచుకుంటారు. ఆ విషయాన్ని చెప్పడానికి ఏమాత్రం సంకోసించరు. చంద్రబాబు ప్రస్తుతం విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. అమరావతి ప్రాంతంలో రాజధాని నిర్మించడానికి వేగంగా అడుగులు వేస్తున్నారు. కేంద్రంలో అనుకూలమైన ప్రభుత్వం ఉన్నప్పటికీ చంద్రబాబు స్వీయ శక్తిని నమ్ముకుని ముందుకు వెళ్తున్నారు. ఈ వయసులో కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రాంతంలో అనేక దేశాలను తిరిగివచ్చారు. అమరావతి ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న పెట్టుబడుల సదస్సుకు రావాలని అక్కడి కంపెనీల అధిపతులను కోరారు. అక్కడి ప్రభుత్వ అధినేతలను విన్నవించారు. అమరావతిలో భారీగా విదేశీ సంస్థలను తమ కార్యకలాపాలు ప్రారంభించే దిశగా చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకరకంగా ఇది సానుకూల అంశం. ఏపీ రాష్ట్రానికి మరింత సానుకూల అంశం. రాజకీయాల విషయాలను పక్కన పెడితే చంద్రబాబు ఈ వయసులో కూడా అక్కడికి వెళ్లడం ఒకరకంగా అద్భుతం అని చెప్పాలి. ప్రత్యేకమైన విమానాలు




ఉన్నప్పటికీ.. అనేక రకాల సౌకర్యాలు ఉన్నప్పటికీ ఈ వయసులో ఆయన అక్కడికి వెళ్లడం మిరాకిల్ అనడంలో ఎటువంటి సందేహం లేదు. కొన్ని రాష్ట్రాలలో చంద్రబాబు కంటే తక్కువ వయసు ఉన్నవారు.. చంద్రబాబుతో సమానంగా వయసు ఉన్నవారు.. చంద్రబాబు కంటే ఎక్కువ వయసు ఉన్నవారు ముఖ్యమంత్రులుగా పనిచేస్తున్నారు. కానీ చంద్రబాబు మాదిరిగా ఎవరూ పెట్టుబడుల కోసం ఇతర దేశాలకు వెళ్లడం లేదు. ఇతర దేశాల కంపెనీల ప్రతినిధులను ఒప్పించడం లేదు. అన్నింటికంటే ముఖ్యంగా రాష్ట్ర అభివృద్ధి విషయంలో అహర్నిశలు శ్రమించడం లేదు. సాధారణంగా ఒక వయసుకు వచ్చిన తర్వాత చాలామంది ఉత్సాహంగా పనిచేయలేరు. ముఖ్యంగా 70 సంవత్సరాల వయసు దాటిన తర్వాత చాలామంది రిలాక్స్ అవ్వాలని కోరుకుంటారు. వయసు వల్ల వచ్చిన నీరసం కూడా ఇబ్బంది పెడుతూ ఉంటుంది. కానీ చంద్రబాబుకు అలసట అనేది తెలియడం లేదు. నీరసమనేది దరిచేరడం లేదు. ఈ వయసులో కూడా ఆయన ఎంతో ఉత్సాహంగా పనిచేస్తున్నారు. తన కలల రాజధాని కోసం విపరీతంగా శ్రమిస్తున్నారు. కేంద్రం నుంచి మొదలుపెడితే విదేశాల వరకు ఆయన అన్ని తలుపులను కూడా తడుతున్నారు. ఉజ్వలమైన ఏపీ కోసం బలమైన అడుగులు వేస్తున్నారు. ఒక నాయకుడు అనే వాడు బలమైన సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. దృఢమైన ఆలోచనలను అమలు చేయాలి. అప్పుడే ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుంది. ఇప్పుడు చంద్రబాబు చేస్తోంది కూడా అదే.

# వైసీపీ నేతల మధ్య గ్యాప్

విజయవాడ, అక్టోబరు 27 వైసీపీ అధినేత జగన్ కు పార్టీల నేతల మధ్య గ్యాప్ ఉన్నట్లు కనిపిస్తుంది. వారి మధ్య సరైన అవగాహన ఉన్నట్లు కనిపించడం లేదు. విశాఖ గూగుల్ డేటా సెంటర్ విషయంలో ఈ విషయం మరొకసారి స్పష్టమయింది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన అవగాహన ఒప్పందాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుదుర్చుకున్నారు. కానీ విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఒప్పందం కుదుర్చుకున్న వెంటనే వైసీపీ ఉత్తరాంధ్ర నేతలు మండిపడ్డారు. డేటా సెంటర్ తో ఉపయోగాలు లేవని, పర్యావరణానికి ముప్పు అని వైసీపీ నేతలు ప్రకటించారు. అదే సమయంలో నీరు,విద్యుత్తు అధికంగా వినియోగమవుతుందని చెప్పుకొచ్చారు.. అయితే వైఎస్ జగన్ రెండు రోజుల క్రితం మీడియా సమావేశంలో గూగుల్ డేటా సెంటర్ వల్ల ఉపయోగాలను పూసగుచ్చినట్లు చెప్పారు. గూగుల్ డేటా సెంటర్ వల్ల భవిష్యత్ లో అనేక ఉపయోగాలున్నాయని, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, క్వాంటమ్ వ్యాలీకి ఈ డేటా సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందని జగన్ చెప్పారు. డేటా సెంటర్ ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని చెప్పుకొచ్చారు. డేటా సెంటర్ వల్ల వచ్చే ఉపాధి అవకాశాలు తక్కువని అన్నారు. భవిష్యత్ లో జరిగే మార్పునకు డేటా సెంటర్ ముఖ్య భూమిక అని జగన్ అన్నారు. రిక్రియేషన్ సెంటర్, ఐటీ పార్క్, స్కిల్ సెంటర్ పెట్టాలని నాడు అదానీతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని జగన్ తెలిపారు. దీంతో వైసీపీ నేతలు డేటా సెంటర్ పై ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు గాలిలో తేలిపోయినట్లయింది.

## కూటమి సర్కార్ లోనూ
# ఫ్యాన్ నేతలు చక్రం

రాజమండ్రి, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 27: ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయి పదిహేడు నెలలవుతుంది. అయితే ఇప్పటికీ రేషన్ బియ్యాన్ని అక్రమంగా



తరలిస్తున్నది వైసీపీ నియమించిన వారేనట. ఈ మాటలన్నది ఎవరో కాదు. స్వయానా తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు చెప్పారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వైసీపీ నేత ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ప్రతి జిల్లాలో తన మనుషులను నియమించుకున్నాని, వారే జిల్లాల్లో ఇప్పటికీ రేషన్ బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని కొలికపూడి శ్రీనివాసరావు చెప్పుకొచ్చారు. కృష్ణా జిల్లాలోనూ రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నది గత ప్రభుత్వ హయాంలో కొడాలి నాని వద్ద ఉన్న ఒక వ్యక్తి అని, అతనే ఇప్పుడు కేశినేని చిన్ని కార్యాలయంలో కూర్చుని ఈ మాఫియాను నడుపుతున్నారని ఆయన తీవ్రమైన ఆరోపణలు చేశారు. కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఆయనకు రాష్ట్ర రాజకీయాలపై ఒక అవగాహన ఉందని అంటున్నారు. అందుకే ఆయన చేసిన ఆరోపణలను ఇప్పుడు టీడీపీ సోషల్ మీడియాలో కూడా కొందరు వ్యతిరేకిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి దాదాపు రెండేళ్లు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ వైసీపీ నేతల మనుషులే రేషన్ బియ్యం మాఫియాను నడుపుతుండటం సిగ్గుచేటని కామెంట్స్ పెడుతున్నారు. వైసీపీ నేతలను అరెస్ట్ చేయాల్సిందిబోయి వారిని అక్కున చేర్చుకోవమేంటని టీడీపీ అభిమానులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇలా అయితే వైసీపీ పాలనకు, కూటమి పాలనకు తేడా ఏముందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రతి జిల్లాలో ఒక మనిషిని ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి నియమించుకున్నారని, వారి ద్వారా రేషన్ డీలర్ల ను బెదిరించి ఇతర రాష్ట్రాలకు రేషన్ బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నారని కొలికపూడి శ్రీనివాసరావు చేసిన ఆరోపణలపై ఇప్పుడు జనసేనకు కూడా చుట్టుకుంది. జనసేనకు చెందిన నాదెండ్ల మనోహర్ పౌరసరఫరాల శాఖ మంత్రిత్వ శాఖను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే నెల్లూరు జిల్లా నేత కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చేసిన వ్యాఖ్యలు నాదెండ్లకు ఆగ్రహాన్ని తెప్పించాయి. తాజాగా కొలికపూడి చేసిన వ్యాఖ్యలతో ఆయన మరింత కోపానికి గురయినట్లు తెలిసింది. మొత్తం మీద కూటమిలో ఇప్పటికీ వైసీపీ నేతల హవా నడుస్తుందన్న కొలికపూడి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలు కూటమి పార్టీల్లో మంటలు రేపుతున్నాయి. చంద్రబాబు వచ్చిన తర్వాత దీనికి ఫుల్ స్టాప్ పడుతుందని భావిస్తున్నారు.

భారత శక్తి

మంగళవారం 28 అక్టోబరు 2025

# ఉత్తరాంధ్ర వైసీపీ నేతలు... అత్యుత్సాహం...

విశాఖపట్టణం, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 27: ఊరికి ముందే ఉత్తరాంధ్ర వైసీపీ నాయకత్వం గూగుల్ డేటా సెంటర్‌కు వ్యతిరేక స్వరం వినిపించింది. అదో గోడౌన్ తప్ప ఉపయోగం లేదని ఒకరు, దానివల్ల వైజాగ్‌లో టెంపరేచర్ పెరుగుతుందని మరొకరు, అలాంటి ప్రాజెక్ట్ వస్తే? ఇంకేదో జరిగిపోతుందని ఇంకొకరు?. రకరకాలుగా కామెంట్స్ చేశారు. అదే సమయంలో ప్రభుత్వం సహజంగానే ఈ ప్రాజెక్ట్‌కు బీభత్సమైన ఎలివేషన్ ఇచ్చింది. వైసీపీ వాళ్ళకు సరిగా తెలియక ఏదేదో మాట్లాడుతున్నారుగానీ? గూగుల్ డేటా సెంటర్ వల్ల వైజాగ్‌లో ఒక ఎకో సిస్టం డెవలప్ అవుతుందని, మిగతా సాఫ్ట్‌వేర్ కంపెనీలు రావడానికి రూట్ క్లియర్ అవుతుందని క్లారిటీ ఇస్తున్నారు ప్రభుత్వ పెద్దలు. ఈ కన్ఫ్యూజన్‌లో? ఎవర్ని నమ్మాలో అర్ధంకాని స్థితిలో ప్రజలు ఉండగానే?. వైసీపీ అధినేత జగన్ తాజాగా మాట్లాడిన మాటల చుట్టూ కొత్త చర్చ మొదలైంది. ఓవైపు ఉత్తరాంధ్ర నాయకులు వ్యతిరేక కామెంట్స్ చేస్తే? జగన్ మాత్రం డేటా సెంటర్స్‌కు అనుకూల స్వరం వినిపించారు. ఒకే ఇష్యూపై డిఫరెంట్ వెర్షన్స్ రావడంతో పార్టీ ప్రయోగించాలనుకున్న రాజకీయ అస్త్రం రివర్స్ అయిందా అనే చర్చకు తెరలేచింది. సరిగ్గా ఇదే పాయింట్‌ని వాడుకుంటూ? సర్కార్ వైపు నుంచి కూడా ఆల్రెడీ అటాక్ మొదలైపోయింది. వైసీపీ నేతలు దాగుడు మూతలతో జనాన్ని మభ్య పెట్టవద్దంటూ ప్రభుత్వం ఎదురు దాడి స్టార్ట్ చేసింది. నువ్వా నేనా అన్నట్టుగా ఉండే పొలిటికల్ సిచ్యుయేషన్స్‌లో ఏ మాత్రం తడబడ్డా? సంకట స్థితి తప్పదు. డేటా సెంటర్ల విషయంలో వైసీపీ ఇప్పుడు అదే స్థితిలోకి వెళ్ళిపోయిందా అంటూ మాట్లాడుకుంటున్నారు ఎక్కువ మంది. ఉద్యోగాలు, పర్యావరణ పర్యవసానాల చర్చల్ని కాసేపు అలా ఉంచితే? అమెరికా బయట గూగుల్ ఇంత భారీ ప్రాజెక్టు ఏర్పాటు చేయడం ఇదే మొదటి సారి. లక్షా 30వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెడుతున్నట్టు ప్రకటించింది. దాన్ని బేస్ చేసుకునే? విశాఖను ఏఐ సిటీగా మార్చేందుకు ఈ డేటా సెంటర్ పునాది అంటూ ప్రభుత్వం ప్రమోట్ చేస్తోంది. ఐతే? ఇందులోకి క్రెడిట్ పాలిటిక్స్ ఎంటరవడంతో మేటర్ రసకందాయంలో పడింది. గూగుల్ డేటా సెంటర్ గురించి ప్రభుత్వం విపరీతంగా ప్రచారం చేసుకుంటోందని, వాళ్ళు చెబుతున్నట్టు లక్షల ఉద్యోగాలన్నది అభూతకల్పన అంటూ విభేదించారు ఉత్తరాంధ్ర వైసీపీ నాయకులు. ఆ విషయంలో కాస్త దూకుడు ప్రదర్శించి గట్టి స్టేట్‌మెంట్సే ఇచ్చేశారు. ఆ పొలిటికల్ గేమ్ అలా నడుస్తుండగానే? తాజాగా మీడియాతో మాట్లాడిన పార్టీ అధ్యక్షుడు జగన్? డేటా సెంటర్స్‌ని మేం వ్యతిరేకించడం లేదు, స్వాగతిస్తున్నామని ప్రకటించారు. పైగా అదానీ డేటా సెంటర్‌కు పునాది వేసింది వైసీపీనేనని క్లారిటీ ఇచ్చేశారాయన. దీంతో మేటర్ కీలక మలుపు తిరిగింది. పార్టీ హైకమాండ్ ఆలోచనలకు, ఉత్తరాంధ్ర నాయకత్వానికి మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ ఉందా? లేక పార్టీ విధానం ఏంటో తెలుసుకోకుండా వాళ్ళు తొందరపడ్డారా అన్న అనుమానాలు వస్తున్నాయట పరిశీలకులకు. వాస్తవంగా? విశాఖలో డేటా సెంటర్ల ఏర్పాటు దిశగా తొలి అడుగు వైసీపీ హయాంలోనే పడింది. మధురవాడ ప్రాంతంలో300 మెగావాట్ల అదానీ డేటా సెంటర్‌కు 2023లో సీఎం హోదాలో శంఖు స్థాపన చేశారు జగన్మోహన్‌రెడ్డి. కేవలం డేటా సెంటర్ ఒక్కటే కాకుండా ఐటీ అనుబంధ పెట్టుబడులు పెట్టే విధంగా అప్పట్లో ప్రభుత్వంతో ఒప్పందం కుదిరింది. అయితే? ప్రస్తుతం గూగుల్ ఏర్పాటు చేయబోతున్నది ఒక గిగావాట్ కెపాసిటీ. స్టోరేజ్ సామర్థ్యం, పెట్టుబడి పరంగా రెండు ప్రాజెక్ట్‌ల మధ్య పొంతన లేకున్నా? ఇదే విశాఖలో డేటా సెంటర్‌కు వైసీపీ హయాంలో శంకుస్థాపన జరిగిందన్నది మాత్రం వాస్తవం. ఉత్తరాంధ్ర వైసీపీ నాయకులు ఆ సంగతి మర్చిపోయి గూగుల్‌పై విమర్శలు చేసి తొందర పడ్డారా అన్న చర్చలు మొదలయ్యాయి రాజకీయవర్గాల్లో. గూగుల్‌కు తాము వ్యతిరేకం కాదంటూనే? డేటా సెంటర్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో? ప్రభుత్వం కూడా ఎదురు దాడి ప్రారంభించింది. వైసీపీ అభివృద్ధికి వ్యతిరేకం కనుకనే గూగుల్‌ను ఆహ్వానించడానికి మనసు రావడం లేదని, ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శిస్తున్నారు అధికారపక్ష నేతలు. మొత్తం మీద ఈ విషయమై వైసీపీలో కమ్యూనికేషన్ గ్యాప్ ఉందన్న విషయం మాత్రం అర్ధమవుతోందని అంటున్నారు పరిశీలకులు.

## పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు...

### తప్పిన పెనుప్రమాదం

ఒంగోలు భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 27: ప్రకాశం జిల్లా మార్కాపురం ? కుంట మధ్య ఆదివారం రాత్రి ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదం నుంచి తప్పించుకుంది. మార్కాపురం నుంచి బెంగళూరు వెళ్తున్న బస్సు కొట్టాలపల్లి గ్రామ మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో ఉన్న ఎనిమిది మంది ప్రయాణికులు ఆందోళనకు గురైయారు. డ్రైవర్ సకాలంలో బ్రేక్ వేయడంతో పెను ప్రమాదం తప్పింది. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

==========================

## స్లీపర్ బస్సులపై ఆర్టీఏ తనిఖీలు.. 32 కేసులు నమోదు

హైదరాబాద్ భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 27:
ఏసీ స్లీపర్ బస్సులలో జరుగుతున్న అక్రమాలపై రవాణా శాఖ తన తనిఖీలను




ముమ్మరం చేసింది. ఆదివారం రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఆర్టీఏ, డీటీసీ బృందాలు బస్సులను తనిఖీ చేయగా, మొత్తం 32 కేసులు నమోదు చేశారు. వాహనాల్లో ఫైర్ ఎక్స్టింగ్విషర్లు లేకపోవడం, యూనిఫారం లేకుండా డ్రైవింగ్ చేయడం వంటి ఉల్లంఘనలను గుర్తించారు. ఈ కేసులకు సంబంధించి రూ.లక్షల్లో కాంపౌండింగ్ ఫీజు వసూలు చేశారు. రంగారెడ్డి జిల్లాలో 7 కేసులు, సౌత్ జోన్లో 11 కేసులు, ఈస్ట్ జోన్లో 3 కేసులు, ఇతర ప్రాంతాల్లో 11 కేసులు నమోదయ్యాయి

## అమరావతికి చట్టభద్రత...



గుంటూరు, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 27:
ఏ రాజకీయ పార్టీకైనా ప్రజాభిప్రాయమే ఫైనల్. ప్రజల అభిష్టానికి వ్యతిరేకంగా వెళితే ప్రతికూల ఫలితాలు తప్పవు. అయితే ఈ విషయంలో వెనక్కి తగ్గిన వారే ప్రజల మధ్య నిలబడగలరు. కానీ ఈ విషయంలో ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి మొండిగా ముందుకు వెళ్తున్నారు. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత కూడా అమరావతి రాజధాని నిర్మాణం పై ఆయన అభిప్రాయం మారలేదు. ఇటీవల ప్రెస్ మీట్ లో అమరావతిపై విముఖత చూపేలా మాట్లాడారు. ఇక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పాటు ఆ పార్టీ అనుకూల మీడియా, సోషల్ మీడియా గురించి చెప్పనవసరం లేదు. పేర్ని నాని లాంటి వ్యక్తి అయితే అమరావతిని ఉద్దేశించి చాలా తేలిగ్గా మాట్లాడారు. అమరావతి మునిగిపోతుందని ఒకరు.. అక్కడ పెట్టుబడి పెట్టడం వేస్ట్ అన్నట్టు మాట్లాడారు. చివరకు వైసిపి గెలిచిన జగన్ అమరావతి నుంచి పాలన సాగిస్తారన్న సకల శాఖ మంత్రి సజ్జలకు సైతం జగన్ క్లాస్ పీకినట్లు వార్తలు వచ్చాయి. అమరావతి రాజధానిపై నాడు జగన్ సర్కార్ వ్యవహరించిన తీరు కూడా మొన్నటి ఓటమికి ఒక కారణం. కానీ దాని నుంచి గుణపాఠాలు నేర్చుకోలేదు జగన్మోహన్ రెడ్డి. 2014, 2019 ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే ఆ రెండుసార్లుతో పోల్చుకుంటే 2024 ఎన్నికల్లో బిజెపికి వచ్చిన స్థానాలు చాలా తక్కువ. దానికి కారణం లేకపోలేదు. వ్యవసాయానికి సంబంధించి మూడు సాగు చట్టాలను తీసుకొచ్చారు ప్రధాని నరేంద్ర మోడీ. దేశవ్యాప్తంగా దీనిపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఉత్తరాది రాష్ట్రాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయింది. ప్రజల అసంతృప్తిని గమనించారు నరేంద్ర మోడీ. తాను ప్రవేశపెట్టిన సాగు చట్టాలపై ప్రజలకు అర్థమయ్యేలా చెప్పలేకపోయామని.. అందుకే వాటిని రద్దు చేస్తున్నట్లు చెప్పి వెనక్కి తగ్గారు ప్రధాని మోదీ. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఎప్పుడైతే సాగు చట్టాలను వెనక్కి తీసుకున్నారు కొంత సానుకూలత గా మార్చుకోండి బిజెపి. ఆ సాగు చట్టాలను వెనక్కి తీసుకోకుంటే మాత్రం బిజెపికి భారీ మూల్యం తప్పదుఅయితే మొన్నటి ఎన్నికల్లో జగన్ మూడు రాజధానుల నిర్ణయాన్ని ప్రజలు వ్యతిరేకించారు. అయినా సరే వైసీపీ అమరావతిపై విషం చిమ్మడం మానలేదు. అయితే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం సైతం స్పష్టమైన సంకేతాలు పంపగలిగింది. ఇకమీదట అమరావతి రాజధానిని కదిలించలేరని తన చర్యల ద్వారా చెప్పింది. ఏకంగా కేంద్ర ప్రభుత్వంలో కీలకమైన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన ప్రధాన కార్యాలయాన్ని అమరావతిలో నిర్మించాలని భావిస్తోంది. నాలుగు ఎకరాల భూమిని అమరావతిలో కొనుగోలు చేసింది. 12 కోట్ల రూపాయలు వెచ్చించి ఏపీ ప్రభుత్వం నుంచి ఆ భూమిని కొనుగోలు చేసింది రిజర్వ్ బ్యాంక్. అన్ని ఆలోచించి రిజర్వ్ బ్యాంక్ ఈ నిర్ణయానికి వచ్చింది. కచ్చితంగా అమరావతిని కేంద్రం చట్టబద్ధత చేస్తుందని తెలిసి ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. రిజర్వ్ బ్యాంక్ పరిధిలో పనిచేసే 12 ప్రాంతీయ బ్యాంకుల సైతం తమ ప్రధాన కార్యాలయాలను నిర్మించనున్నాయి. ఈ నెల 28న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఈ కార్యాలయ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. కేంద్రం నుంచి అనుమతి తీసుకున్న తర్వాత మాత్రమే ఈ ఆర్థిక రంగ బ్యాంకింగ్ సంస్థల ఏర్పాటు జరుగుతుంది. అంటే త్వరలో పార్లమెంటులో అమరావతి రాజధానికి చట్టబద్ధత లభించనుందన్నమాట.

## బీహార్ లో ప్రచారానికి చంద్రబాబు, పవన్

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 27:
దేశంలో విచిత్ర రాజకీయ పరిస్థితి నడుస్తోంది. ముచ్చటగా మూడోసారి



అధికారంలోకి వచ్చి ప్రధాని అయ్యారు నరేంద్ర మోడీ. అయితే అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి రాజకీయంగా పోరాటం చేస్తోంది. చిన్న అవకాశం కోసం ఎదురుచూస్తోంది. ముఖ్యంగా బిహార్ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలిస్తే బిజెపికి ఇబ్బందికర పరిస్థితులు తప్పవు. అందుకే అక్కడ చెమటోడ్చుతుంది ఎన్డీఏ. అక్కడ గెలుపు ఏమంత సులువు కాదు కూడా. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి గట్టి సవాల్ విసురుతోంది. ఒక విధంగా చెప్పాలంటే బీహార్ ఎన్నికల వరకు ఒక ఎత్తు. దాని ఫలితాలు మరో ఎత్తు అన్నట్టు ఉంటుంది పరిస్థితి. ఎన్డీఏ కూటమిలో భాగస్వామ్య పక్షాలు తక్కువ. అదే ఇండియా కూటమిలో అయితే జాతీయస్థాయిలో చాలామంది నేతలు ఉన్నారు. ఇండియా కూటమి తరుపున ప్రచారం చేసేందుకు చాలామంది నేతలు క్యా కడుతున్నారు. ఈ తరుణంలో ప్రధాని నరేంద్ర మోడీ, బీహార్ సీఎం నితీష్ కుమార్ గట్టి వ్యూహాలు రూపొందిస్తున్నారు. జాతీయస్థాయిలో చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక ఇమేజ్ ఉంది. కొన్ని దశాబ్దాలుగా కేంద్ర రాజకీయాల్లో సుపరిచితుడు చంద్రబాబు. ఆపై మంచి పాలనా దక్షుడు అన్న పేరు తెచ్చుకున్నారు. జాతీయస్థాయిలో మంచి ఇమేజ్ ఉంది.

అందుకే బీహార్ ఎన్నికల్లో ప్రచారం చేయాలని చంద్రబాబును బిజెపి పెద్దలతో పాటు నితీష్ కుమార్ ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు తెలుస్తోంది. గతంలో ఢిల్లీలో ప్రచారం చేశారు చంద్రబాబు. అక్కడ తెలుగువారితో పాటు జాతీయస్థాయిలో చంద్రబాబు ప్రభావం చూపడంతో ఎన్డీఏ గెలుపులో భాగస్వామ్యం అయ్యారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వెళ్లిన చంద్రబాబు సోదరుడు రామ్మూర్తి నాయుడు ఆకస్మిక మరణంతో తిరిగి వచ్చేసారు. ఇప్పుడు బీహార్ ప్రచారానికి వెళ్తున్నట్లు స్వయంగా చంద్రబాబు ప్రకటించారు. పవన్ కళ్యాణ్ సైతం బీహార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశం ఉంది. గతంలో అన్ని రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో పవన్ పాల్గొన్నారు. సనాతన ధర్మం, హిందూ పరిరక్షణ విషయంలో పవన్ చర్యలను జాతీయస్థాయిలో హిందూ వాదులు గట్టిగానే సమర్థించారు. బీహార్లో సైతం పవన్ ప్రచారం చేస్తే హిందువులు గుంప గుత్తిగా ఎన్డీఏకు ఓటు వేస్తారని బిజెపి పెద్దల ఆలోచన. అయితే బిజెపి విషయంలో పవన్ ఎప్పుడు సానుకూలంగానే ఉంటారు. తప్పకుండా బిజెపి వినతిని పరిగణలోకి తీసుకొని బీహార్ ప్రచారంలోకి వెళ్తారు పవన్ కళ్యాణ్. అయితే ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం బిజీగా ఉంది. వచ్చే నెల 14, 15 తేదీల్లో విశాఖలో పెట్టుబడుల సదస్సు జరగనుంది. దానికి ఆహ్వానించేందుకు సీఎం చంద్రబాబు తో పాటు మంత్రులు తరచూ విదేశాలకు వెళ్తున్నారు. వచ్చే నెల విశాఖ సదస్సు జరగనున్న దృష్ట్యా బిజీ గా ఉన్న తరుణంలో.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వేర్వేరుగా బీహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లే అవకాశం ఉంది. దీనిపై అధికారిక షెడ్యూల్ రావాల్సి ఉంది.

## మరో బాంబు పేల్చిన కొలికపూడి



విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 27: కూటమిలో ఇప్పుడు కొలికపూడి కాక రేపుతున్నారు. ఇప్పటికే విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని వర్సెస్ కొలికపూడి అన్నట్టు ఉంది పరిస్థితి. అయితే తాజాగా కొలికపూడి సంచలన అంశాలను బయటపెట్టారు. ఇప్పటికీ కూటమిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హవా నడుస్తోందని.. దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే కూటమికి నష్టం అని తేల్చి చెప్పారు. అయితే ఇప్పటివరకు జరిగింది ఒక ఎత్తు. ఇప్పుడు కొలికపూడి చెబుతోంది మరో ఎత్తు. ఆయనను అంత తక్కువ అంచనా వేయడానికి వీలులేదు. ఎంతోమందికి పొలిటికల్ సైన్స్ పాఠాలు చెప్పి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా తీర్చిదిద్దిన ఘనత కొలికపుడిది. ఇప్పటివరకు ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లైన్లో మాట్లాడుతున్నారని అందరూ అనుకున్నారు. కానీ ఇప్పుడు అదే వైసీపీ మనుషులు కూటమి పార్టీలో ఉన్నారని సంచలన విషయాలను బయటపెట్టారు. ఇప్పుడు అవే హాట్ టాపిక్ అవుతున్నాయి. ఇప్పటివరకు ఆయన పై హై కమాండ్ చర్యలు తీసుకుంటుందని అంతా భావించారు. కానీ ఇప్పుడు హై కమాండ్ కె కొలికపూడి సూచనలు ఇస్తుండడం విశేషం. వైసీపీ హయాంలో ఒక వెలుగు వెలిగారు కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్. ఆయనది స్వతహాగా బియ్యం వ్యాపారం. అయితే రేషన్ మాఫియా నడుపుతున్నది ఆయనేనని ఆరోపణలు ఉన్నాయి. గతంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సైతం ఆయనపై విమర్శలు చేసిన సందర్భాలు ఉన్నాయి. కానీ ఇంతవరకు ఆయనపై ఎటువంటి చర్యలు లేవు. మొన్న ఆ మధ్యన కాకినాడలో ఒక షిప్ దొరికిన సంగతి తెలిసిందే. అప్పట్లోనే ద్వారంపూడి చంద్రశేఖర్ పేరు బలంగా వినిపించింది. ఆయనపై ఎటువంటి కేసులు నమోదు కాలేదు. చర్యలు కూడా తీసుకోలేకపోయారు. తాజాగా కొలికపూడి ద్వారంపూడి చంద్రశేఖర్ మనుషులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్నారని.. వారే రేషన్ బియ్యం మాఫియా ను నడుపుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు. మరోవైపు మాజీ మంత్రి కొడాలి నాని అనుచరుడు.. ఎంపీ కేశినేని నాని కార్యాలయంలో కూర్చొని దందాను నడుపుతున్నారంటూ కొలికపూడి వ్యాఖ్యానించడం విశేషం. ఎంపీ కేశినేని చిన్ని తన పేరు కొలికపూడి బయట పెట్టడాన్ని జీర్ణించుకోలేకపోయారు. అసెంబ్లీ టికెట్ కోసం తన వద్ద ఐదు కోట్ల రూపాయలు తీసుకున్నారంటూ ఆరోపించారు కొలికపూడి. అక్కడ నుంచి వివాదం ప్రారంభం కాగా నిన్ననే కూటమి సమన్వయ సమావేశం పేరిట బలప్రదర్శనకు దిగారు చిన్ని. దాదాపు ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఎమ్మెల్యేలతో పాటు కీలక నేతలంతా హాజరయ్యారు. అయితే ఇప్పుడు కొత్త విషయాన్ని బయటపెట్టారు కొలికపూడి. కొడాలి నాని మనుషులు కేశినేని చిన్ని కార్యాలయంలో ఉండడాన్ని హైలెట్ చేశారు. ద్వారంపూడి చంద్రశేఖర్ మనషులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్నారని చెప్పడం ద్వారా పౌర సరఫరాల శాఖను తప్పుపట్టారు. ఆ శాఖను నిర్వర్తిస్తోంది జనసేన నేత నాదెండ్ల మనోహర్. తద్వారా చిన్ని కూటమి ద్వారా తనను అడ్డుకునే ప్రయత్నం చేయగా.. అదే కూటమిని ఇరకాటంలో పెట్టగలిగారు కొలికపూడి. రాజకీయంగా బద్ధ శత్రువుగా ఉన్న కొడాలి నాని మనిషిని తెచ్చుకొని.. కేశినేని చిన్ని అవినీతికి పాల్పడుతున్నారని చెప్పడంలో సక్సెస్ అయ్యారు కొలికపూడి. దీంతో ఈ వివాదం యూటర్న్ తీసుకుంది.

## ప్రైవేట్ బస్సులు సరే...ఆర్టీసీ బస్సుల సంగతేంటీ...

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 27: కర్నూలులో వేమూరి ట్రావెల్స్ సంస్థకు సంబంధించిన బస్సు అగ్ని ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో దాదాపు 20 మంది దాకా చనిపోయారు. అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ప్రమాదం తర్వాత ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తెలంగాణ ఆర్టిఏ విస్తృతంగా తనిఖీచేస్తోంది. లోపాలు ఉన్న బస్సులను పక్కన పెడుతోంది. ఆ ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థల నిర్వాహకులపై కేసులు కూడా నమోదు చేస్తోంది. ప్రవేట్ సంస్థలు మాత్రమే కాదు.. ప్రజా రవాణా సంస్థగా పేరుపొందిన ఆర్టీసీలు కూడా పరిస్థితులు అలానే ఉన్నాయి. కర్నూలు ప్రమాదం తర్వాత ఆర్టీసీ సంస్థ వివరాలు చూస్తే నిజంగానేగ్భ్రాంతి కలిగించేలా ఉన్నాయి.. హైదరాబాద్ నగర పరిధిలోని జగద్గిరిగుట్ట ప్రాంతంలో కనీసం దూర ప్రాంత డ్రైవర్లకు విశ్రాంతి తీసుకోవడానికి మంచాలు కూడా లేవట. దీంతో వారు కిందనే పడుకోవాల్సిన పరిస్థితి. పైగా డ్రైవర్లకు నిద్ర కూడా సరిగ్గా ఉండడం లేదట. నైట్ హాల్ట్ సర్వీసులో వెళ్లే వారికి నిద్రపోవడానికి తగినంత సమయం.. ఇతర సౌకర్యాలు కూడా ఉండడం లేదట. రాత్రిపూట బస్సులను నడిపే డ్రైవర్లు మధ్యాహ్నం ఒకటి నుంచి రెండు గంటలకు స్టీరింగ్ పడితే రాత్రి 10 గంటలకు డ్యూటీ ముగుస్తుందట. ఈ ప్రకారంగా చూసుకుంటే ఏకధాటిగా ఎనిమిది నుంచి తొమ్మిది గంటల పాటు డ్రైవర్లు బస్సులు నడపాసి వస్తుందట. గమ్యం చేరిన తర్వాత చాలా ప్రాంతాలలో కనీస సదుపాయాలు లేవట. కొన్నిసార్లు రోడ్డు పక్కనే బస్సులు ఆపుకొని అందులో ఉన్న సీట్లపై డ్రైవర్లు నిద్రిస్తున్నరట. ఆర్టీసీ సంస్థ ఏర్పాటు చేస్తున్న గదులు చిన్నవిగా ఉండడంతో డ్రైవర్లకు అవి సరిపోవడం లేదట. పైగా ఆ రూములలో పడకలు లేకపోవడంతో కటిక నేల మీదనే నిద్రపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. భోజనం చేసిన తర్వాత నిద్రపోయేసరికి రాత్రి 11 గంటల 30





నిమిషాల వరకు అవుతోందట. రూట్ ఆధారంగా తెల్లవారుజామున మూడు గంటల 30 నిమిషాల నుంచి నాలుగు గంటల మధ్యలో నిద్ర లేచి నాలుగు గంటల 30 నిమిషాల వరకు మళ్ళీ స్టీరింగ్ పట్టుకోవాల్సి వస్తుందట. ఈ ప్రకారం డ్రైవర్లకు నిద్రపోవడానికి కేవలం 5 గంటల వరకే సమయం ఉంటుంది. ఇలాంటి క్రమంలో ఎటువంటి పొరపాటు జరిగిన సరే అది భారీ ప్రమాదానికి కారణం అవుతుంది. హైదరాబాద్ నుంచి మొదలు పెడితే ఇతర నగరాలకు ప్రైవేటు ఆపరేటర్లు నడిపించే బస్సుల్లో కూడా ఇద్దరు డ్రైవర్లు ఉంటున్నప్పటికీ? వారికి తగిన స్థాయిలో విశ్రాంతి ఉండడం లేదు. కొన్ని సందర్భాలలో ప్రవేటు బస్సు ఆపరేటర్లు రెండో డ్రైవర్ పడుకునే బెర్త్ కూడా అమ్ముకుంటున్నారు. దీంతో రెండవ డ్రైవర్ కూడా కంటిమీద కునుకు లేకుండానే ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. హైదరాబాదులోని ఉప్పల్ ప్రాంతంలో నైట్ హాల్ట్ చేసే బస్సులు డ్రైవర్లకు ఏమాత్రం సౌకర్యాలు లేవు. వరంగల్ రెండో డిపోలో 19 బస్సులు ఉన్నాయి. తొర్రూరు డిపోలో 18 బస్సులు ఉండగా.. ఇవన్నీ కూడా రోడ్డు పక్కనే హాల్ట్ అవుతున్నాయి. దీంతో బస్సుల్లోనే డ్రైవర్లు నిద్రపోతున్నారు. చివరికి సులబ్ కాంప్లెక్స్ లలో కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. రాత్రి 11 గంటలకు గమ్యస్థానాలకు చేరుకుంటే.. నిద్రపోయేసరికి 11:30 దాటుతోంది.

## భద్రతపై భారత్ మరింత దృష్టి....

హైదరాబాద్,భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 27:ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ త్రివిధ దళాల బలోపేతంపై మరింత దృష్టిపెట్టింది. మన సైనిక శక్తి ప్రపంచానికి తెలియడంతో సరికొత్త ఆయుధాలతోపాటు సరికొత్త సైన్యాన్ని అప్‌గ్రేడ్ చేస్తోంది. సమకాలీన యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. ఈ క్రమంలోనే "భైరవ్ బెటాలియన్లు" రూపుదిద్దుకున్నాయి. సైన్యంలో ఇదో కీలక పరిణామం. ఆధునిక పరికరాలు, స్మార్ట్ సెన్సర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఈ యూనిట్లు అత్యంత వేగంగా స్పందించగల సామర్థ్యం కలిగి ఉంటాయి. లెఫ్టినెంట్ అజయ్ కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. నవంబర్ 1న తొలి భైరవ్ దళం రంగప్రవేశం చేస్తుంది. ఇప్పటికే ఐదు యూనిట్లు శిక్షణ దశలో ఉండగా, మరో 20 పైగా సిద్ధం చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. భైరవ్ యూనిట్ల ప్రధాన లక్ష్యం ? సాధారణ పదాతిదళాలు లేదా ప్రత్యేక బలగాలు నేరుగా వీలుపడనప్పుడు వ్యూహాత్మకంగా సాహసోపేతమైన ఆపరేషన్లు నిర్వర్తించడం. ఒక్కో యూనిట్‌లో 250 మంది అత్యంత నిపుణులైన జవాన్లు, 7?8 మంది అధికారిస్థాయి నాయకత్వంతో ఉంటారు. వీరు శత్రు భూభాగంలో లోతుగా ప్రవేశించే తక్షణ దాడులు, ఆపరేషన్లు, సీక్రెట్ మిషన్‌లు నిర్వర్తించగల నేర్పు కలిగి ఉంటారు. సంఖ్యాపరంగా తక్కువగా ఉన్నప్పటికీ, క్రియాశీలత, సమర్థత పరంగా వీరి ప్రాధాన్యం ఎంతో ఎక్కువ. భైరవ్ దళాల ప్రవేశం భారత సైన్యంలో మారుతున్న రణరీతులను ప్రతిబింబిస్తోంది. భవిష్యత్తులో యుద్ధాలు కేవలం బలంపై కాకుండా టెక్నాలజీ, వేగం, గూఢచారి సమాచారంపై ఆధారపడతాయి. ఈ యూనిట్లు వీటన్నింటిని సమన్వయం చేస్తూ భవిష్యత్ యుద్ధరంగానికి సరైన మోడల్‌గా నిలుస్తాయి. దేశ భద్రతా వ్యవస్థలో ఇవి ఒక కొత్త అధ్యాయం ఆరంభమనే చెప్పాలి. భైరవ్ బెటాలియన్లు భారత రక్షణ వ్యవస్థలో సంస్కరణాత్మక మార్పుకు సూచిక. ఇవి శత్రు ప్రాంతాల్లో తక్షణ చర్యకు ప్రత్యేక యాంత్రిక మానవ శక్తుల్లా పనిచేస్తాయి. ఇలాంటి యూనిట్లు సైన్యంలో చేరడం భవిష్యత్తు సమర భ్యూహాలకు భారత సైన్యం పూర్తిగా సిద్ధమైందని చెప్పవచ్చు.

# పాకిస్తాన్‌కు వాటర్ ట్రబుల్స్

లాహోర్,భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 27:పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ దశాబ్దాల నాటి సిందూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసి పాకిస్తాన్‌ను నీటిదెబ్బ కొట్టింది. అవసరం ఉన్నప్పుడు ఆపి.. అవసరం లేనప్పుడు వదులుతూ వరదలు సృష్టిస్తోంది. దీంతో పాకిస్తాన్ ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఇక ఇప్పుడు ఆఫ్ఘానిస్తాన్ కూడా భారత్ బాటలో పయనిస్తోంది. ఆఫ్ఘానిస్తాన్‌పాకిస్తాన్ మధ్య ఎలాంటి జల ఒప్పందాలు లేవు. దీంతో ఆఫ్ఘానిస్తాన్ నుంచి పాకిస్తాన్‌లోకి ప్రవహించే నీటిని నియంత్రించాలని నిర్ణయించింది. తాలిబన్ నాయకత్వం కునార్ నది ప్రవాహాన్ని నియంత్రించే ప్రణాళికలు వేగవంతం చేసింది. తాలిబాన్ నాయకుడు హైబతుల్లా ఖుల్‌జాదా ఆదేశాల మేరకు, స్థానిక ఇంజినీర్లు కాంట్రాక్టర్లతో డ్యాం నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. తమాషా ఏమిటంటే.. ఈ ప్రాజెక్టులో కేవలం భారత్ సాంకేతిక సలహాలు మాత్రమే ఉపయోగించవచ్చని సూచించారు. ఇతర దేశాల జోక్యాన్ని పూర్తిగా నిరోధించారు. ఈ నిర్ణయం పాకిస్తాన్‌కు వ్యూహాత్మకంగా మరొక దిశలో దెబ్బతీయబోతున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది.హిందూకుష్ పర్వత శ్రేణుల వద్ద నుంచి ఉద్భవించే కునార్ నది, ఆఫ్ఘానిస్తాన్‌లోని నంగర్‌హార్, కునార్ రాష్ట్రాల మీదుగా ప్రవహించి, చివరగా కాబూల్ నదిలో కలుస్తుంది. అక్కడి నుంచి ఇది పాకిస్తాన్ సరిహద్దు చేరి చిత్రాల్ నదిగా పేరు మార్చుకుంటుంది. తర్వాత పంజాబ్, ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా రాష్ట్రాలకు సాగు, తాగునీటి మూలంగా మారుతుంది. ఈ నదిపై ఆఫ్ఘాన్ డ్యాం పూర్తి అయితే, పాకిస్తాన్‌లోని రెండు ప్రధాన వ్యవసాయ రాష్ట్రాలకు నీటి సరఫరా తీవ్రంగా తగ్గిపోతుంది. నీటి కొరతతో సాగు వ్యవస్థలు దెబ్బతినడమే కాక, పాకిస్తాన్‌లో ఆహార భద్రత కూడా సంక్షోభంలో పడే అవకాశం ఉంది.




ఆఫ్ఘానిస్తాన్‌కు భారత్ ఇప్పటికే జలాభివృద్ధి రంగంలో కీలక మద్దతు అందిస్తోంది.
2016లో సల్మా డ్యాం (ఇండియా?ఆఫ్ఘాన్ ఫ్రెండ్షిప్ డ్యాం) నిర్మాణానికి 100 మిలియన్ డాలర్లను భారత ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇది 42 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యంతో పాటు 85,000 ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. ప్రస్తుతం షాతూత్ డ్యాం పనులు కొనసాగుతున్నాయి, దీనికి 250 మిలియన్ డాలర్ల పెట్టుబడి కేటాయించబడింది. ఈ డ్యాం ద్వారా కాబూల్ పట్టణానికి తాగునీరు, వ్యవసాయ అవసరాలు తీరుస్తుంది. ఇప్పుడు కునార్ నది ప్రాజెక్టులో భారత్ సలహాదారుడిగా పాల్గొనడం, పాకిస్తాన్‌కు డిప్లొమాటిక్ ఒత్తిడిని పెంచుతోంది.భారత్ సిందూ ఒప్పందాన్ని నిలిపివేయడం, ఆఫ్ఘాన్ కూడా కునార్ నది ప్రవాహాన్ని నియంత్రించేందుకు సన్నద్ధం కావడంతో పాకిస్తాన్ రెండు వైపులా నీటి ఒత్తిడిలో చిక్కుకుంటోంది. ఒకవైపు భారత్ సరిహద్దు నుంచీ నీటి ప్రవాహం తగ్గుతుండగా, మరోవైపు ఆఫ్ఘాన్ సరిహద్దు నుంచీ నిల్వ డ్యామ్ నిర్మాణం అతడిని ఆర్థికంగా బిగించబోతుంది. తాలిబన్ ప్రభుత్వం మొదటిసారి జల వనరులను జాతీయ ఆస్తిగా పరిగణించి, వాటిని భద్రపరిచే ప్రణాళికలను సీరియస్‌గా తీసుకుంది. ఇది కేవలం పాక్‌పై ఒత్తిడికే కాదు, తమ అంతర్గత నీటి అవసరాలు, విద్యుత్ ఉత్పత్తి, సాగు భూముల విస్తరణకు కూడా కీలకం.కునార్ నది ప్రాజెక్ట్ ద్వారా ఆఫ్ఘానిస్తాన్ తన భౌగోళిక ప్రభావాన్ని విస్తరించడమే కాకుండా, భారత్‌తో వ్యూహాత్మక సంబంధాలను మరింత బలపరిచింది. పాకిస్తాన్‌కు మాత్రం ఇది మరో జల సంక్షోభం గంట మోగించినట్లే. భారత్?ఆఫ్ఘాన్ జలసహకారం కొత్త సమీకరణానికి ఆరంభం కావొచ్చు. ఇది దక్షిణాసియా భవిష్యత్తును ప్రభావితం చేసే అవకాశం ఉంది.

# నవంబర్ 3 నుంచి కాలేజీల బంద్




హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 27:
తెలంగాణలో ఉన్నత విద్యాసంస్థలు సమ్మె సైరన్ మోగించేందుకు రెడీ అయ్యారు. భవిష్యత్ కార్యచరణ సిద్ధం చేసుకొని ఆందోళనకు సన్నాహాలు చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలనే డిమాండ్‌తో నవంబర్ 3 నుంచి రాష్ట్రంలోని కాలేజీల బంద్‌కు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య నిర్ణయించింది. ఇప్పటికే ప్రభుత్వానికి సమ్మె నోటీసు అందించిన సమాఖ్య, ఇప్పుడు జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించింది. తెలంగాణలో నవంబర్ 3 నుంచి నిరవధిక బంద్ చేయాలని నిర్ణయించాయి ప్రైవేటు కాలేజీలు. ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య జనరల్ బాడీ మీటింగ్‌లో ఈ మేరకు నిర్ణయం ప్రకటించారు. ప్రభుత్వం హామీ ఇచ్చి మళ్లీ నెరవేర్చక పోతే.. మార్చి , ఏప్రిల్‌లో జరిగే ఫైనల్ పరీక్షలు కూడా బాయ్‌కాట్ చేస్తామని హెచ్చరించారు. బకాయిలు అడిగితేనే ప్రభుత్వానికి విజిలెన్స్ తనిఖీలు గుర్తుకు వస్తున్నాయని.. ? బెదిరింపులకు భయపడి ఈసారి వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు.ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు దీపావళి నాటికి 1200 కోట్ల బకాయిలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం? ఇవ్వలేదని కాలేజీ యాజమాన్యాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దసరాకి 600 కోట్లు ఇస్తామని చెప్పి 200 కోట్లు మాత్రమే ఇచ్చిందని? మిగిలిన బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. బకాయిల విడుదలపై తక్షణం క్లారిటీ ఇవ్వాలని కోరుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం సమాఖ్య ప్రతినిధులు ఇప్పటికే మంత్రులను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అయినా ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో బంద్ పాటించాలని నిర్ణయించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనను తీవ్రతరం చేస్తూ, నవంబర్ మొదటి వారంలో లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధన, బోధనేతర సిబ్బందితో 'చలో హైదరాబాద్' నిర్వహించాలని ప్రైవేట్ ప్రొఫెషనల్ కళాశాలలు యోచిస్తున్నాయి.రాష్ట్రంలో దాదాపు 2,500 ప్రైవేట్ విద్యాసంస్థలు ఉన్నాయని, వీటిలో ఇంజనీరింగ్, ఫార్మసీ, బి.ఎడ్, నర్సింగ్, ఇతర ప్రొఫెషనల్ ప్రోగ్రామ్‌లను అభ్యసిస్తున్న 15 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని, ఎక్కువ మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి ఉన్నారని.. సొంతంగా ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్నారని తెలంగాణ ఉన్నత విద్యా సంఘాల సమాఖ్య తెలిపింది.ఈ విద్యార్థులలో ఎక్కువ మంది ఫీజు రీయింబర్స్‌మెంట్‌పైనే ఆధారపడి చదువుతున్నారు. బకాయిలు నిలిచిపోవడం వల్ల కళాశాలల నిర్వహణ, బోధనా ప్రమాణాలు దెబ్బతిని.. విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ఈ నిరసన కార్యాచరణను ఖరారు చేసేందుకు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య నేడు జనరల్ బాడీ మీటింగ్‌ను నిర్వహించింది. ప్రభుత్వం ఈ సమస్యపై సానుకూలంగా స్పందించకపోతే.. రాష్ట్రంలోని ఉన్నత విద్య స్తంభించిపోయే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని సమాఖ్య ఉద్ఘాటిస్తోంది.

# తెలుగు టెక్ ట్యూట్స్..

కరీంనగర్, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 27:
తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాకు చెందిన ఒక యువకుడు తన సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ కంటెంట్ క్రియేషన్ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని పొందారు. గోదావరిఖనిలోని యైటింక్లైన్ కాలనీకి చెందిన సయ్యద్ హఫీజ్ కు ఏకంగా యూఏఈ గోల్డెన్ వీసా లభించింది. సింగరేణి కార్మికుడి కుటుంబం నుంచి వచ్చి, ఉన్నత విద్య చదవకపోయినా.. తన సొంత టాలెంట్ తో ఈ స్థాయికి ఎదగడం తెలంగాణ వాసులకు గర్వకారణంగా నిలిచింది. హఫీజ్ 2011లోనే 'తెలుగు టెక్ ట్యూట్స్' పేరుతో తన యూట్యూబ్ ఛానెల్‌ను ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ సుపరిచితులైన హఫీజ్.. తన వీడియోల ద్వారా డిజిటల్ స్టార్‌గా ఎదిగారు. ప్రధానంగా మొబైల్ ఫోన్లు, టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్ల గురించి సమగ్రంగా వివరిస్తారు. కొత్త ఫోన్ల అన్‌బాక్సింగ్ .. వాటి ప్రత్యేకతలు, లాభనష్టాలు, అప్‌డేట్స్‌లోని పాజిటివ్, నెగటివ్ అంశాలను ప్రజల ముందు ఆవిష్కరిస్తారు.సుమారు 1.8 మిలియన్లకు (1.79 మిలియన్లు) పైగా సబ్‌స్క్రైబర్లు కలిగి ఉన్న ఈ ఛానెల్ ద్వారా హఫీజ్ 4.2 వేలకు పైగా వీడియోలను అందించి మన్ననలు పొందారు. ప్రస్తుతం యూట్యూబ్ ద్వారా ఆయన నెలకు రూ. 2 లక్షలకు పైగా ఆదాయాన్ని పొందుతున్నారు. హఫీజ్ డిజిటల్ ప్రయాణం కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాలేదు. 2022లో ఫోర్బ్స్ ఇండియా ప్రకటించిన టాప్ 100 డిజిటల్ స్టార్స్ జాబితాలో సయ్యద్ హఫీజ్ 32వ స్థానంలో నిలిచారు. తెలుగు ప్రజలను ఆయన వీడియోలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయని ఫోర్బ్స్ తన మ్యాగజైన్‌లో కొనియాడింది.సామాజిక ప్రభావాన్ని సృష్టించగలిగిన ప్రపంచవ్యాప్తంగా 10 వేల మంది క్రియేటర్లను ఎంపిక చేసే యూఏఈ గోల్డెన్ వీసాకు హఫీజ్ అర్హత సాధించడం ఎంతో గొప్ప విషయం. సాధారణంగా రెండేళ్ల వీసాకే రూ. 4 కోట్లకు పైగా ఖర్చయ్యే చోట.. హఫీజ్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు పదేళ్లపాటు ఉచితంగా యూఏఈలో నివసించేందుకు.. అక్కడ ఉద్యోగం లేదా వ్యాపారం చేసుకునేందుకు ఈ వీసా అవకాశం కల్పిస్తుంది. అంటే దాదాపు హఫీజ్‌కు పరోక్షంగా రూ.40 కోట్ల వరకు ఆదా అయింది. ఈ అరుదైన అవకాశం దక్కడంపై సయ్యద్ హఫీజ్ ను సదాశివ ఫౌండేషన్ శాలువాలతో సన్మానించారు. హఫీజ్ సాధించిన ఈ అంతర్జాతీయ విజయం తెలుగు యువతకు ఒక స్ఫూర్తిదాయకమైన ఉదాహరణగా నిలుస్తుందన్నారు.

# చేతగాని హామీలు ఎవరు ఇవ్వమన్నారు....

## మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్ అక్టోబరు 27,
ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోమవారం నాడు బన్సీలాల్ పేట లోని జబ్బార్ కాంప్లెక్స్ నుండి ఆటో డ్రైవింగ్ చేసి డ్రైవర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల ను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది. ఏడాదికి 12 వేలు ఇస్తామన్నారు...రెండేళ్లు అయింది 24 వేలు వెంటనే ఇవ్వాలి. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం లక్ష ఆటోలతో ఆందోళన చేపడతాం. ఆటో డ్రైవర్లు తలచుకుంటే ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తారు. ఆటో డ్రైవర్ల కుటుంబాల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుందని అన్నారు.

# పంజాబ్‌లో ఐఎస్ ఐ కార్యలకలాపాలు...?

ఛండీఘడ్, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 27:
భారత్‌లో అల్లర్లు సృష్టించేందుకు, దాడులు చేసేందుకు, బాంబు పేలుళ్లు జరిపేందుకు పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్‌ఐ నిత్యం ప్రయత్నిస్తోంది. ఉగ్రవాద సంస్థలకు సహాయ సహకారాలు అందిస్తుంది. జమ్మూ కశ్మీర్ స్వాధీనమే లక్ష్యంగా ఇంతకాలం కార్యకలాపాలు సాగించిన ఐఎస్‌ఐ.. ఇప్పుడు రూట్ మార్చింది. కశ్మీర్‌లో భద్రత కట్టుదిట్టం కావడంతో పంజాబ్‌పై ఐఎస్‌ఐ దృష్టి పెట్టింది. అమృత్‌సర్ జిల్లలో భద్రతా బలగాల సోదాల్లో రాకెట్ ప్రొపెల్లర్ గ్రెనేడ్ (ఆర్పీజీ) పట్టుబడడం ఆందోళన కలిగించింది. ఇది 500 మీటర్ల దూరం వరకు యాంటీ ట్యాంక్ దాడులు చేయగల శక్తివంతమైన ఆయుధం. పెద్ద భవనాలు, రక్షణ వాహనాలు లేదా కాన్వాయ్‌లపై దాడికి వినియోగించవచ్చు. ఈ పరిణామం పంజాబ్‌లో ఉగ్రవాద చర్యలు మరోసారి చెలరేగే సూచనగా భావిస్తున్నారు.పంజాబ్‌కు పాకిస్తాన్‌తో 550 కిలోమీటర్ల పొడవైన సరిహద్దు ఉంది. ఇరువైపులా భాషా, సాంస్కృతిక సామ్యాలు ఎక్కువగా ఉండటంతో సరిహద్దు గమనించటం కష్టం అవుతోంది. తర్లోదడిణి మార్గాల్లో ఉగ్రవాదులు, ఖలిస్తాన్ అనుచరులు చొరబడేందుకు ప్రయత్నాలు నిరంతరం కొనసాగుతున్నాయని ఇంటెలిజెన్స్ నివేదికలు వెల్లడిస్తున్నాయి.తరుణ్‌తారన్, గుర్‌దాస్‌పూర్, అమృత్‌సర్, పఠాన్‌కోట్, ఫజిల్కా జిల్లాలు పాకిస్తాన్ సరిహద్దులో ఉండటంతో తీవ్ర స్పర్శలో ఉన్న ప్రాంతాలుగా గుర్తించబడ్డాయి. ముఖ్యంగా తరుణ్‌తారన్ ఎంపీ అమృత్‌పాల్ సింగ్ పేరు ఖలిస్తాన్ ఉద్యమ పునరుద్ధరణతో ముడిపడింది. ఈ ప్రాంతంలో బిద్రావాల తర్వాత రెండో తరంగం ఆలోచన వ్యాప్తి చెందుతోందని కేంద్ర భద్రతా ఏజెన్సీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.2025కి ముందు నుంచి పంజాబ్ గగనతలంలో డ్రోన్ కార్యకలాపాలు పెరిగిన విషయం తెలిసిందే. పాకిస్తాన్ వైపు నుంచి గ్రెనేడ్లు, కమ్యూనికేషన్ పరికరాలు, మత్తు పదార్థాలు డ్రోన్‌ల ద్వారా తరలిస్తున్నారని ఇంటెలిజెన్స్



హెచ్చరికలు ఉన్నాయి. తాజా ఆర్పీజీ పట్టుబడటంతో ఈ డ్రోన్ నెట్‌వర్క్ మరింత ప్రమాదకర దిశగా వృద్ధి చెందుతోందన్న సందేహం మరింత బలపడింది.మునుపు పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌పై జరిగిన ఉగ్రదాడి తర్వాత ఇప్పుడు అదే ప్రాంతంలో సరిహద్దు మార్గాల వద్ద భద్రత కఠినతరం చేశారు. హైవే మూసివేత తదితర చర్యలు చేపట్టడం ప్రభుత్వం ఈ ముప్పును ఎంత జాగ్రత్తగా పరిగణించిందో సూచిస్తోంది. కశ్మీర్‌లో ఉగ్ర నెట్‌వర్క్ బలహీనపడటంతో ఐఎస్‌ఐ ఇప్పుడు పంజాబ్‌ను కొత్త స్థావరంగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని కేంద్ర ఇంటెలిజెన్స్ నివేదిక తేల్చింది. అమృత్‌సర్‌లో పట్టుబడ్డ ఇద్దరు యువకుల అరెస్టు ఈ కుట్రలో భాగమని దర్యాప్తు అధికారులు పరిశీలిస్తున్నారు.పంజాబ్ సరిహద్దుల్లో ఆర్పీజీ స్వాధీనం కావడం భారత భద్రతా వ్యవస్థకు కొత్త హెచ్చరికగా నిలిచింది. కశ్మీర్ తర్వాత పంజాబ్‌ను అస్థిరం చేయాలన్న పాకిస్తాన్ ఉద్దేశ్యం స్పష్టమవుతోంది. కేంద్రం, రాష్ట్రం సమన్వయంతో సరిహద్దు భద్రతను మరింత కట్టుదిట్టం చేయడం తప్పనిసరి అనే సందేశం ఈ ఘటన మళ్లీ గుర్తు చేసింది.

# అమెరికా అభివృద్ధిలో భారతీయులు కీలకం

న్యూయార్క్,భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 27:ఇండియా లేకుంటే.. అమెరికా లేదు.. రెండు దశాబ్దాల క్రితం అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్ అన్నమాటలు ఇవి. అమెరికా అభివృద్ధిలో భారతీయుల పాత్రను గుర్తించి చేసిన వ్యాఖ్యలు ఇవీ. తర్వాత వచ్చిన పాలకులు కూడా ఇంత ఓపెన్ కాకపోయినా భారతీయులకు తగిన ప్రాధాన్యం



ఇచ్చారు. భారత సంతతికి చెందినవారికి కీలక పదవులు కట్టబెట్టారు. తాజాగా డొనాల్డ్ ట్రంప్ తన 2.0 పాలనలో కూడా భారత సంతతికి చెందినవారికి కీలక బాధ్యతలు అప్పగించారు. ఇక అమెరికాలో అత్యాధునిక సాంకేతికత, ఆరోగ్య సేవలు, వ్యాపార రంగాల్లో భారతీయ వలసవాసుల పాత్ర అమెరికా ఆర్థికవ్యవస్థకు బలాన్నిస్తోంది. తాజా పరిశోధన ప్రకారం ఇండియన్ మూలాల వలసదారులు అమెరికా ఫెడరల్ ప్రభుత్వానికి ఇతర దేశాల వలసదారుకన్నా అత్యధిక ఆర్థిక లాభాన్ని తెచ్చిపెడుతున్నారు.తాజా అధ్యయనం తెలిపిన ప్రకారం, ఒక్కో భారతీయ వలస కుటుంబం, వారి సంతానం మూడున్నర దశాబ్దాల్లో సగటున 1.7 మిలియన్ డాలర్లు(దాదాపు రూ.14 కోట్లు) మేర ప్రభుత్వానికి నికర లాభాన్ని అందించింది. ఇది ఇతర వలస జనాభా గుంపులతో పోలిస్తే చాలా ఎక్కువ. చైనా వలసదారులు 900,000 డాలర్లు, ఫిలిప్పీన్స్ వాసులు 650,000 డాలర్లు, కొలంబియా వాసులు 500,000 డాలర్లు, వెనిజులా వాసులు 400,000 డాలర్లు, డొమినికన్ రిపబ్లిక్ వలస వాదులు 200,000 డాలర్లు, క్యూబా వలసవాదులు 150,000 డాలర్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. వలసదారులు చెల్లించిన పన్నుల నుంచి వారు పొందిన ప్రజా సేవలు, సబ్సిడీలను తగ్గించిన తర్వాత లభించిన నికర ఆర్థిక ప్రయోజనాన్ని ఈ లెక్కలు సూచిస్తున్నాయి. భారతీయులు అమెరికాలో టెక్నాలజీ, మెడిసిన్, ఫైనాన్స్, ఎంటంప్రెన్యూర్‌షిప్ వంటి రంగాల్లో ప్రధాన భాగస్వామ్యం వహిస్తున్నారు. అత్యధిక విద్యార్హతలు, ఉన్నత వృత్తి నైపుణ్యాలు, దీర్ఘకాల స్థిరత వీరిని ఫిస్కల్ అసెట్‌గా నిలిపాయి. అనేక సిలికాన్ వ్యాలీ స్టార్టప్‌లలో భారత్ మూలం ఉన్న వ్యక్తులే స్థాపకులు కావడం, వేలాది మంది డాక్టర్లు, ఇంజినీర్లు, పరిశోధకులు అమెరికా సామాజిక మూలధనాన్ని బలోపేతం చేయడం ఇందుకు స్పష్టమైన ఉదాహరణ.ఈ లెక్కలు అమెరికా వలస విధానాల అమలు ఫలితాలను ప్రతిబింబిస్తున్నాయి. ఉన్నత నైపుణ్యం గల ప్రజలను ఆకర్షించే విధానాలు అమెరికా ఆర్థిక శక్తిని పెంచాయి. భారతీయ వలసదారులు అందులో ప్రముఖ పాత్ర పోషించారు. సామాజిక మాధ్యమాల్లో వలసదారులపై ఉన్న అపార్థాలను ఈ డేటా ఖండిస్తోంది.
ఈ అధ్యయనం ప్రకారం, భారతీయ వలస సమాజం ఒక్క ఆర్థిక వనరుగా మాత్రమే కాదు, అమెరికా సాంస్కృతిక, శాస్త్రీయ, వ్యాపార ప్రగతిలో కీలక భాగస్వామిగా అవతరించిందని స్పష్టం అవుతోంది. మూడు దశాబ్దాల వ్యవధిలో ఒక్క కుటుంబం స్థాయి నుంచి కూడా ప్రభుత్వం బిలియన్ల డాలర్ల ఆదా సాధించడం భారత వలసదారుల ప్రాధాన్యానికి నిదర్శనం

# ప్రభుత్వ పాఠశాలలో బాలికలు ఉన్నత చదువులు చదవాలి: మంత్రి సీతక్క



ములుగు జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 27 (భారత శక్తి) : ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ప్రతి బాలిక ఉన్నత చదువులు చదవాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ములుగు జిల్లా కేంద్రం లోనిమాధవరావుపల్లి గ్రామ సమీపంలో రెండు కోట్ల 30 లక్షల నిధులతో నిర్మించిన కస్తూరిబా గాంధీ విద్యాలయ నూతన తరగతి గదులు,ప్రయోగశాలలను కలెక్టర్ దివాకర్ టిఎస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్ లతో కలిసి సోమవారం ప్రారంభించారు.
అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ గతంలో బాలికలకు విద్య అవసరం లేదనే సనాత ధర్మం పాటిస్తూ వంటగదిలకే పరిమితం చేశారని, నేడు మహిళలు అన్ని రంగాలలో ముందంజలో ఉన్నారని వివరించారు. దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు జ్యోతిరావు పూలే భార్య సావిత్రిబాయి విద్యా బోధన చేశారని, అప్పటి నుండి ఇప్పటి వరకు మహిళలు విద్యను బోధిస్తున్నారని తెలిపారు. బాలికలకు ప్రత్యేక పాఠశాలలు ఉండాలని ఉద్దేశంతో మహాత్మా గాంధీ సతీమణి కస్తూరిబా గాంధీ పేరుతో పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి ఒక్కరు ఎంత నేర్చుకున్నామనేది ముఖ్యం కాదని నేర్చుకున్న పరిజ్ఞానాన్ని పదిమందికి తెలపడమే గొప్ప విషయమని అన్నారు. తాను సైతం ప్రభుత్వ హాస్టల్లో ఉండి విద్యను అభ్యసించానని, ప్రతి బాలిక తమ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన అందించడం జరుగుతుందని తెలిపారు. రానున్న పదవ తరగతి పరీక్షలలో రాష్ట్రం లో జిల్లాను మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేయాలని అన్నారు.
జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేశామని,
నేడు బాలికలకు నూతన భవనం నిర్మాణంతో తరగతి గదులు, ప్రయోగశాలల అన్ని సమస్యలు తీరిపోయాయని తెలిపారు. విద్యా బోధనలు చేసిన ఉపాధ్యాయురాలు తమ స్వంత పిల్లల లాగానే విద్యను అభ్యసిస్తున్న బాలికలను చూసుకోవాలని అన్నారు.
ఈ కార్యక్రమంలో ఈ ఈ ఎడ్యుకేషన్ ఇంజనీర్ అరుణ్ కుమార్, డిఈఓ సిద్ధార్థ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

## నలుగురు అరెస్ట్,నగదు స్వాధీనం. వివరాలు వెల్లడించిన రూరల్ ఎస్సై వెంకట్రాజం.

వేములవాడ రూరల్, అక్టోబర్ 27 (భారత శక్తి) : పేకాట స్థావరం పై సోమవారం పోలీసులు రైడ్ చేసి నలుగురిని అరెస్ట్ చేసినట్లు వేములవాడ రూరల్ ఎస్సై వెంకట్రాజం మీడియాతో వివరాలు వెల్లడించారు.వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేట్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులు రామ్ రెడ్డి, రవీందర్, శ్రీనివాస్, దేవయ్య లను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై వెంకట్రాజం తెలిపారు. వారి వద్ద నుండి 40, 210/- రూపాయలు, ప్లే కార్డ్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# రానున్న మూడు రోజుల పాటు జిల్లాలో తుఫాను ప్రభావం జిల్లా యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. -జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి (భారత్ శక్తి) అక్టోబర్ 27:జిల్లా కలెక్టర్ ఐడిఓసి కార్యాలయంలో దాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లు మరియు తుఫాను ప్రభావం దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హైదరాబాద్ నుండి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి శల్ తుమ్మల నాగేశ్వరరావు, సిఎస్ రామకృష్ణా రావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు.
అనంతరం రెవెన్యూ, పౌర సరఫరాలు, పౌర సరఫరాల సంస్థ, వ్యవసాయ, సహకార, డిఆర్డీఓ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి తుఫాను ప్రభావం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 1.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, 1.15 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలోని ఐదు జిన్నింగ్ మిల్లుల ద్వారా పత్తి కొనుగోలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. అలాగే, నవంబర్ మొదటి వారం నుండి ధాన్యం మార్కెట్‌లోకి రావచ్చని అంచనా దృష్ట్యా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి సన్నద్ధంగా ఉండాలని తెలిపారు.
వాతావరణ శాఖ సూచనల మేరకు తుఫాను ప్రభావం ఉన్నందున గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.రాబోయే రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అలాగే ప్రభుత్వ యంత్రాంగం సూచనలను పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.
ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, సహకార అధికారి వాలియా నాయక్, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు, డిఆర్డీఓ బాలకృష్ణ, ఉద్యాన శాఖ అధికారి సునిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# రానున్న మూడు రోజులు తుఫాను ప్రభావం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




భూపాలపల్లి (భారత శక్తి) అక్టోబర్ 27: హైదరాబాద్ నుండి ధాన్యం, పత్తి, మొక్క జొన్న, సోయా కొనుగోళ్లు, రానున్న మూడు రోజులు తుఫాను ప్రభావం ఉన్న దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలపై అన్ని జిల్లాల కలెక్టర్లుతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ పకడ్బందీ టీము వర్కుతో రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా కొనుగోలు చేయాలని సూచించారు. తుఫాను తీరం దాటే సమయంలో ఎక్కువ ప్రభావం ఉంటుందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తూఫాను తీవ్రత తగ్గే వరకు రైతులు కోతలు కొయొద్దని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం రవాణా చేయాలని ఆదేశించారు. ధాన్యం తడవకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆరుబయట ఉన్న ధాన్యం తడవకుండా రక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల నుండి దాన్యం, మొక్కజొన్న, సోయా రాకుండా పటిష్ట%జ% పర్యవేక్షణ చేయాలని తెలిపారు. పంటలను మ్యాచింగ్, బ్యాచింగ్ చేయాలని స్పష్టం చేశారు. రైతులు పత్తి పంటను తేమ లేకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని,
రాబోయే మూడు రోజుల్లో తుఫాన్ ప్రభావం ఉండే అవకాశం ఉందని రైతులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.
వరి పంట సాగు చేసిన రైతులు తుఫాన్ తరువాత పంట కోతలు కోయాలని కోతలు వాయిదా వేయడం వల్ల ధాన్యం పాడవకుండా ఉంటుందని, కోతలు కోయకుండా ఉంటే పంట త్వరగా ఆరడానికి అవకాశం ఉంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.
సరిహద్దు జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సన్న వడ్ల కు బోనస్ చెల్లిస్తున్నందున ఇతర రాష్ట్రాల నుండి వచ్చి రైతులు మన రాష్ట్రంలో ధాన్యం అమ్మే అవకాశం ఉందని కలెక్టర్లు అప్రమత్తగా వ్యవహరించాలని సూచించారు. ఇది చాలా క్రుషియల్ సమయమని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 8342 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# నిఘా మన ఉమ్మడి బాధ్యత' ఇది కేవలం నినాదం మాత్రమే కాదు ఆచరణ కోసం పిలుపు : శ్రీ కె. పద్మనాభయ్య , ఐఏఎస్ (రిటైర్డ్), ఏ.ఎస్.సి. ఐ చైర్మన్

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 27:నిఘా అవగాహన వారోత్సవాన్ని దక్షిణ మధ్య రైల్వే పాటిస్తున్నది. ఈ సందర్భంగా 58 వ సంచిక ' అనిమిష' విజిలెన్స్ బులెటిన్ విడుదల దక్షిణ మధ్య రైల్వే విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు -2025ను 27 అక్టోబర్ నుండి 2నవంబర్ 2025 వరకు నిర్వహిస్తోంది. ప్రస్తుత సంవత్సర నేపథ్యం "నిఘా- మన ఉమ్మడి బాధ్యత"ను పాటిస్తోంది. ఈ సందర్భంగా సోమవారం దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం రైల్ నిలయంలో నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు-2025 ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా చైర్మన్ శ్రీ కె. పద్మనాభయ్య , ఐఏఎస్ (రిటైర్డ్) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథిగా దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ శ్రీ సత్య ప్రకాష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులు, డివిజనల్ రైల్వే మేనేజర్, హైదరాబాద్ డివిజన్,ఇతర సీనియర్ అధికారులు మరియు సిబ్బంది కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ అధికారులు మరియు సిబ్బంది చేత సత్యనిష్ట ప్రతిజ్ఞ చేయించడంతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా, ముఖ్య అతిథి శ్రీ కె. పద్మనాభయ్య , దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్‌తో కలిసి 58 వ ఎడిషన్ విజిలెన్స్ బులెటిన్ " అనిమిష" ను విడుదల చేశారు. ఈ బులెటిన్ దక్షిణ మధ్య రైల్వే అధికారిక వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంది . ఈ సందర్భంగా అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా చైర్మన్ శ్రీ కె. పద్మనాభయ్య , ఐఏఎస్ (రిటైర్డ్) మాట్లాడుతూ,రైల్వేలు మరియు రక్షణ శాఖలు దేశానికి మూలస్తంభాలని అన్నారు. రైల్వేలు భారతదేశాన్ని అనుసంధానిస్తున్నాయని మరియు దేశవ్యాప్తంగా విభిన్న సంస్కృతుల ప్రజలను మమేకం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. భారత రైల్వేల




పనితీరును ఆయన ప్రశంశిస్తు భారత ఆర్థిక వ్యవస్థలో రైల్వేల ప్రాముఖ్యత ఎంతో గర్వనియమని చెప్పారు. 2025 నిఘా అవగాహన వారోత్సవం అనే అంశంపై మాట్లాడుతూ - " విజిలెన్స్ - మన ఉమ్మడి బాధ్యత" అనేది కేవలం నినాదం కాదని, ఆచరణ కోసం పిలుపు అని ఆయన నొక్కి చెప్పారు. ప్రీవెన్టివ్ విజిలెన్స్ యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు మరియు ప్రతి వ్యక్తి స్వీయ విజిలెన్స్ అధికారిగా ఉండాలని ప్రోత్సహించారు. శ్రీ కె. పద్మనాభయ్య విజిలెన్స్ విభాగం పనితీరు మరియు సుపరిపాలన యొక్క ముఖ్య అంశాలైన బహిరంగత, చట్ట నియమాలకు కట్టుబడి ఉండటం, పారదర్శకత, పౌర కేంద్రీకృత మరియు భాగస్వామ్య విధానం మధ్య సమాంతరాలపై చర్చించారు. విజిలెన్స్ విభాగం యొక్క రోజువారీ పనిలో ఈ సూత్రాలను వర్తింపజేయడం వలన విజిలెన్స్ కేసులు తగ్గుతాయని మరియు శాఖ యొక్క సామర్థ్యం మరింత పెరుగుతుందని ఆయన నొక్కి చెప్పారు. నిర్దేశించిన విధానాలు మరియు నియమాలను కచ్చితంగా పాటించడం యొక్క ప్రాముఖ్యతను ఆయన హైలైట్ చేశారు. సైబర్ మోసాలు పెరగకుండా చూడాలని హెచ్చరించారు మరియు అలాంటి కేసులను నివారించడం పై అధ్యయనం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ శ్రీ సత్య ప్రకాష్ ముందుగా ఈ సభలో ప్రసంగించారు. 2025 విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ నేపథ్యం – " విజిలెన్స్ – మన ఉమ్మడి బాధ్యత" అనేది భారతీయ రైల్వేలకు మాత్రమే కాకుండా మొత్తం సమాజానికి చాలా సందర్భోచితంగా ఉందని ఆయన అన్నారు. విజిలెన్స్ అనేది ప్రతి వ్యక్తి తమ చర్యలు, నిర్ణయాలు మరియు సమగ్రత ద్వారా సమర్థించాల్సిన సమిష్టి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. వేలాది మంది ఉద్యోగులు ప్రతిరోజూ సజావుగా కార్యకలాపాలు నిర్వహించే దక్షిణ మధ్య రైల్వే వంటి సంస్థలో, సమగ్రతలో చిన్న లోపం కూడా భద్రత, వినియోగదారుని విశ్వాసం, ఆర్థికవ్యవస్థ మరియు ప్రజల విశ్వాసాన్ని ప్రభావితం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. అందువల్ల నిజాయితీని ప్రోత్సహించే, పారదర్శకతను పాటించే మరియు నైతిక ప్రవర్తనను ప్రశంసించే వాతావరణాన్ని మనం పెంపొందించుకోవాలని ఆయన నొక్కి చెప్పారు. సంతోషకరమైన మరియు న్యాయమైన సమాజాన్ని కలిగి ఉండటానికి నిజాయితీ మరియు సమగ్రతను జరుపుకోవాలి, గౌరవించాలి మరియు ఆరాధించాలి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో, అధికారులు మరియు సిబ్బంది అవినీతి దుష్ప్రభావాలను హైలైట్ చేస్తూ మరియు విజిలెన్స్ అవగాహన వారం యొక్క ముఖ్య సందేశాన్ని వ్యాప్తి చేస్తూ ఒక స్కిట్ ప్రదర్శించారు. ఔట్రీచ్ కార్యకలాపాలలో భాగంగా, రైల్వే పాఠశాలలు మరియు కళాశాలల విద్యార్థులు సి.వి.సి ఇచ్చిన ఇతివృత్తంపై ఇంగ్లీష్/హిందీ వ్యాస రచన మరియు పోస్టర్ పెయింటింగ్ పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

# ప్రజావాణిలో వచ్చినా సమస్యలు పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి :అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



భూపాలపల్లి (భారత శక్తి) అక్టోబర్ 27:
ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదుల దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి మొత్తం 36 దరఖాస్తులు స్వీకరించామని, వాటిని సంబంధిత శాఖాధికారులకు తక్షణ పరిష్కారానికి ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలనే ఉద్దేశంతో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అధికారులు ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతగా తీసుకోవాలని, తీసుకున్న చర్యలపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆందోళన అవసరం లేదు, అప్రమత్తంగా ఉండాలి..! టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లాస్థాయి అధికారులను సూచించిన జిల్లా ఇంచార్జి కలెక్టర్ అదితి సింగ్

కడప, అక్టోబర్ 27(భారత శక్తి) : మంథా తుఫాన్ ప్రభావం ప్రారంభం అయిన నేపథ్యంలో ఆందోళన అవసరం లేదని, అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి విపత్తులు ఎదురైనా ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ అదితి సింగ్ జిల్లా అధికారులకు సూచించారు. మంథా తుఫాను పరిస్థితులను ఎదుర్కొనే చర్యలు, సంసిద్ధతపై జిల్లా ఇంచార్జి కలెక్టర్ అదితి సింగ్ జిల్లా స్థాయి అధికారులతో సోమవారం సాయంత్రం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పంట నష్టం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై తగు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా చెరువు కట్టలు, కాలువ గట్ల పరిరక్షణపై దృష్టి పెట్టాలని, వాగులు, వంకలు, కుంటల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.
అధిక వర్షాలు కురవడం వలన రిజర్వాయర్లు, నదులు, వాగులు, వంకలు, చెరువులు ఉప్పొంగే అవకాశాలు ఉన్నందున పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ అవసరమైన సహాయక చర్యలను అందించేందుకు సంబందిత సిబ్బందితో 24 గంటలు సిద్ధంగా ఉండాలన్నారు. ఇరిగేషన్ అధికారులు, ఇంజనీర్లు చేపట్టాల్సిన భద్రతా చర్యలపై అలర్ట్ గా ఉండాలన్నారు. జిల్లా అధికారులు మొదలు నియోజకవర్గ, మండల, సచివాలయ, గ్రామ స్థాయి వరకు ప్రతి అధికారి సిబ్బంది వారి వారి కార్య స్థానాలలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అన్ని రెవెన్యూ డివిజన్ల పరిధిలో పోలీసు, అగ్నిమాపక సిబ్బందితో పాటు రెస్క్యూ టీమ్ ను కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు.
వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగు చేసే రైతులను అప్రమత్తం చేయాలని పంట నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడా పాడి సంరక్షణకు, పశు నష్టం జరగకుండా పశు సంవర్ధక సహాయకులు బాధ్యత వహించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం అయితే వెంటనే దానిని పునరుద్ధరించేలా చర్యలు చేయపట్టాలన్నారు.



వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి జిల్లాలోని అన్ని ఏరియా ఆసుపత్రులు, పీహెచ్ సిలలో సకాలంలో డాక్టర్లు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అందుబాటులో ఉండాలని, బాలింతలు, గర్భిణీలను సురక్షితమైన ప్రాంతాల్లో ఉంచి ప్రత్యేక సంరక్షణ అందివ్వాలన్నారు. అవసరమైన మందులను అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు చేపడుతున్న ముందస్తు సంసిద్ధత ఏర్పాట్లపై ఇంచార్జి కలెక్టర్ సమీక్షించారు.
అత్యవసర సహాయ సమాచార నిమిత్తం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని కంట్రోల్ రూంతో పాటు కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవో కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ నెంబర్లను సద్వినియోగం చేసుకునేలా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.
- జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, కడప కంట్రోల్ రూమ్ : 08562 - 246344
- ఆర్డీవో కార్యాలయం, కడప : 08562 - 295990
- ఆర్డీవో కార్యాలయం, జమ్మలమడుగు : 95028 36762
- ఆర్డీవో కార్యాలయం, బద్వేలు : 6301432849
-ఆర్డీవో కార్యాలయం, పులివెందుల : 8919134718

పైన తెలిపిన కంట్రోల్ రూమ్ నంబర్లతో పాటు ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాలకు కానీ ఫోన్ ద్వారా తెలియజేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ సూచించారు.


# మద్యం దుకాణాల ప్రక్రియను లాటరీ పద్ధతిలో ఎంపిక



భూపాలపల్లి (భారత శక్తి) అక్టోబర్ 27: 2025%-%27 సంవత్సరాలకు గాను మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియను జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్ లో లాటరీ పద్ధతిలో నిర్వహించారు.ములుగు మరియు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు మొత్తం 59 మద్యం దుకాణాల ఎంపికకు లాటరీ ప్రక్రియ చేపట్టగా, అందులో 57 దుకాణాలకు ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా వీడియో గ్రఫీ మధ్యవిజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.గెజిట్ నంబర్ 49 చల్వాయి గ్రామం మరియుగెజిట్ నంబర్ 50 గోవిందరావుపేట, ములుగు జిల్లా మద్యం దుకాణాలకు ప్రోహిబిషన్ మరియు ఎక్సజ్ కమీషనర్ హైదరాబాద్ వారి ఉత్తర్వులు మేరకు లక్కీ డ్రా తీయడం నిలిపి వేశామని, తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు వాయిదా వేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా షాపు నెంబర్ 40కు అత్యధికంగా 77 దరఖాస్తులు రాగా, డ్రా ద్వారా 46 నెంబర్ దుకాణం ఎంపికైనట్లు తెలిపారు. డ్రా కార్యక్రమం పటిష్ట బందోబస్తు మధ్య నిర్వహించబడగా, ఎక్సైజ్ శాఖ అధికారులు, పోలీసు అధికారులు మరియు దరఖాస్తు దారులు తదితరులు పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఈ ఎస్ ఎస్ శ్రీనివాస్, డీఎస్పీ సంపత్ రావు, ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 27 :





సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో సోమవారం మార్కెట్ కమిటీ పరిధిలో గల మంజీత్ కాటన్ మిల్ లో సి సి ఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని టీజీ ఐఐసి చైర్మన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ పత్తి రైతులెవరు తక్కువ ధరకు పత్తిని విక్రయించొద్దని గవర్నమెంట్ మద్దతు ధరకు అమ్ముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సి డి సి చైర్మన్ గడిల రామ్ రెడ్డి , ఆత్మ కమిటీ చైర్మన్ ఎల్లకొండ ప్రభు , మార్కెట్ కమిటీ చైర్మన్ సడాకుల కుమార్ , సదాశివపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ధన్న , సదాశివపేట తహసిల్దార్ గారు, మార్కెట్ కమిటీ వారు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సి సి ఐ వారు, పత్తి రైతులు మిగతావారు పాల్గొన్నారు.

# జిల్లా బాల భవిత కేంద్రము విజిట్ మరియు న్యాయ విజ్ఞాన సదస్సు

కడప, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 27:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా డాక్టర్ సి.యామిని చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కడప వారి సూచనల మేరకు శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు "కడప రిమ్స్ ఆవరణంలో గల జిల్లా సత్వర చికిత్స కేంద్రము / జిల్లా బాల భవిత కేంద్రము విజిట్ మరియు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టినప్పటి నుండి 18 సంవత్సరాల లోపు గల పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించిన పిల్లల తల్లిదండ్రులు ఇలాంటి చికిత్స సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలి, "కడప రిమ్స్ ఆవరణంలో గల జిల్లా సత్వర చికిత్స కేంద్రము / జిల్లా బాల భవిత కేంద్రము ఎన్నో సదుపాయాలు గల ఈ సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలి, ప్రత్యేక పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి, ప్రస్తుత సమాజంలో ప్రత్యేక పిల్లలు




కూడా ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారు, వీరి కోసం గౌరవ జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా) వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024, జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ (నల్సా) వారి మానసిక అనారోగ్యం ఉన్న వ్యక్తులు మరియు మేధో వైకల్యాలున్న వ్యక్తులకు చట్టపరమైన సేవలు పథకం 2024 పథకములను ప్రవేశపెట్టినది, సద్వినియోగం చేసుకోవాలి, వికలాంగుల హక్కుల చట్టం 2016, మానసిక ఆరోగ్యం సంరక్షణ చట్టం 2017, జాతీయ మానసిక ఆరోగ్య విధానం 2014, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్లైన్ నెంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్ లైన్ నెంబర్ 14456, ఉచిత న్యాయ సహాయము మొదలగు అంశాలను వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చును అన్నారు.అనంతరం వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లి ఏబుల్ ట్రాంజెండర్ అండ్ సీనియర్ సిటిజన్ వారి సహకారంతో డాక్టర్లతో ఇద్దరికీ చెవిటి పరీక్షలు నిర్వహించి రెండు హియరింగ్ మిషన్లను అందజేయడం జరిగినది.
ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లి ఏబుల్ ట్రాంజెండర్ అండ్ సీనియర్ సిటిజన్ సూపరిండెంట్, జిల్లా సత్వర చికిత్స కేంద్రము / జిల్లా బాల భవిత కేంద్రము డాక్టర్లు, సిబ్బంది, పారా లీగల్ వాలంటరీలు, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.




## 'మాస్ జాతర' ప్రీరిలీజ్ ఈవెంట్.. గెస్ట్ ఎవరంటే

రవితేజ కథానాయకుడిగా భాను భోగవరపు దర్శకత్వంలో రానున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మాస్ జాతర'. శ్రీలీల కథానాయిక. అక్టోబర్ 31న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో దీని ప్రీరిలీజ్ ఈవెంట్ వివరాలను చిత్రబృందం పంచుకుంది. హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్స్‌లో అక్టోబర్ 28 సాయంత్రం ఈ వేడుక జరగనున్నట్లు ప్రకటించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోలీవుడ్ అగ్ర కథానాయకుడు సూర్య హాజరుకానున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు నిర్మాణ సంస్థ ఓ పోస్టర్‌ను విడుదల చేసింది.

'మాస్ జాతర' విషయానికొస్తే.. 'ధమాకా' తర్వాత రవితేజ – శ్రీలీల కలిసి నటించిన చిత్రమిది. రవితేజ పోలీసు అధికారి పాత్రలో సందడి చేయనున్నారు. తాజాగా ఈ చిత్రం సెన్సార్ పూర్తిచేసుకొంది. 'మాస్ జాతర'కు యూ/ఏ సర్టిఫికెట్ లభించింది. సినిమా నిడివి 160 నిమిషాలుగా ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ సినిమాలోని పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

## 7 సంవత్సరాలు వరుసగా ఫ్లాప్‌లే.. ఐరన్‌లెగ్ అన్నారు: రమ్యకృష్ణ



తన కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న ఒడుదొడుకులను నటి రమ్యకృష్ణ తాజాగా గుర్తుచేసుకున్నారు. జగపతిబాబు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న టాక్ షో 'జయమ్ము నిశ్చయమ్మురా'. ఇప్పటికే పలువురు సినీ తారలు ఈ షోకు వచ్చి ఎన్నో ఆసక్తికర విషయాలను పంచుకోగా, తాజాగా రమ్యకృష్ణ ) అతిథిగా వచ్చి సందడి చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన లేటెస్ట్ ఎపిసోడ్ విడుదలైంది. ఇందులో తన కెరీర్ ప్రారంభ రోజులను ఆమె గుర్తుచేసుకున్నారు.

"నా కెరీర్ ప్రారంభంలో అందరూ నన్ను ఐరన్‌లెగ్ అన్నారు. తెలుగులో నా తొలిచిత్రం 'భలే మిత్రులు'. అందులో సెకండ్ హీరోయిన్‌గా నటించాను. ఆ సమయంలో వరుసగా 7 సంవత్సరాలు నేను నటించిన అన్ని సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. అమ్మానాన్న ఇక నన్ను మళ్లీ చదువుకోమని చెప్పారు. అప్పుడు ఒక జ్యోతిష్యుడు నేను పెద్ద స్టార్ అవుతానని ఇండస్ట్రీలోనే ఉండాలని సూచించారు. ఆ తర్వాత దర్శకుడు విశ్వనాథ్ గారు 'సూత్రధారులు' కోసం నన్ను ఆడిషన్స్‌కు పిలిచారు. డాన్స్ చేయమన్నారు. ఆయనకు నచ్చి ఓకే చేశారు. యాక్టింగ్‌లో స్కూల్, కాలేజ్, పీజీ మొత్తం ఆ ఒక్క సినిమాతో నేర్చుకున్నాను. నాలో ఉన్న నటిని ప్రపంచానికి చూపించే అవకాశం ఆ సినిమాతో వచ్చింది. అందులోని పాటలకు విశ్వనాథ్‌గారే కొరియోగ్రఫీ చేశారు. ఆ సినిమానే నా కెరీర్‌కు తొలిమెట్టు. ఆ చిత్రం చూసిన తర్వాతే రాఘవేంద్రరావు 'అల్లుడుగారు'లో అవకాశం ఇచ్చారు. అలా 1984లో ఇండస్ట్రీకి వస్తే.. 1991లో మొదటి హిట్ వచ్చింది" అని తెలిపారు.కృష్ణవంశీతో తన వివాహం గురించి రమ్యకృష్ణ పంచుకున్నారు. "మేం మంచి స్నేహితులం. ఒకరిని ఒకరు అర్థం చేసుకుంటే వివాహబంధం చాలా గొప్పగా ముందుకు సాగుతుంది. మేం ఇద్దరం కలిసి ఎదిగాం. వంశీ ప్రతి విషయంలోనూ సపోర్ట్ చేస్తాడు" అని చెప్పారు.

## ఈ వారం బాక్సాఫీస్ వద్ద వినోదాల విందు.. థియేటర్/ఓటీటీ చిత్రాలివే


### బాహుబలి... ఈసారి ఒకే సినిమాగా!

'బాహుబలి' మరోసారి ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమయ్యాడు. అయితే ఈసారి ఒకే సినిమాతో సందడి చేయనున్నాడు. రెండు




భాగాలుగా వచ్చిన 'బాహుబలి' చిత్రాలు ఈసారి 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఒకే భాగంగా అక్టోబరు 31న ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు. 3 గంటలా 44 నిమిషాల నిడివితో ఈ చిత్రం రానుంది. దర్శకుడు రాజమౌళి స్వయంగా ఎడిటింగ్ బాధ్యతలను పర్యవేక్షించిన నేపథ్యంలో సుదీర్ఘ చిత్రాలను ఒక్కటిగా ఎలా చేశారు? ఏయే సన్నివేశాలను ఉంచారు? అన్నది ఆసక్తికరం. ఇప్పటికే టికెట్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. ప్రభాస్, రానా, అనుష్క, తమన్నా, రమ్యకృష్ణ, సత్యరాజ్, నాజర్ తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ మూవీకి కీరవాణి స్వరాలు సమకూర్చారు.

### ఒకరోజు ఆలస్యంగా..



రవితేజ కథానాయకుడు నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మాస్ జాతర'. అక్టోబరు 31న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. అయితే అదే రోజు 'బాహుబలి: ది ఎపిక్' కూడా థియేటర్లలోకి వస్తున్న నేపథ్యంలో రవితేజ చిత్రాన్ని ఒకరోజు వాయిదా వేసినట్లు సమాచారం. ఈనెల 31న సాయంత్రం ప్రత్యేక ప్రదర్శనలుంటాయని తెలుస్తోంది. నవంబరు 1న సినిమా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'మాస్ జాతర'కు భాను భోగవరపు దర్శకత్వం వహించగా.. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. శ్రీలీల కథానాయిక. భీమ్స్ సిసిరోలియో సంగీతమందించారు.

### క్రైమ్ థ్రిల్లర్‌గా..

శత్రు, బ్రహ్మాజీ, మహేంద్రన్ ముఖ్య పాత్రల్లో రూపొందిన చిత్రం 'కర్మణ్యే వాధికారస్తే' ఉషస్విని ఫిలిమ్స్ బ్యానర్‌పై డీఎస్ఎస్ దుర్గా




ప్రసాద్ నిర్మిస్తున్నారు. అమర్ దీప్ చల్లపల్లి దర్శకుడు. వర్తమాన నేర ప్రపంచంలో జరుగుతున్న ఘటనల ఆధారంగా వైవిధ్యభరితమైన కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది. అక్టోబరు 31న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది.

పరేశ్ రావల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ది తాజ్ స్టోరీ' . ఇటీవల విడుదల చేసిన మోషన్ పోస్టర్ వివాదాస్పదమైంది. సురేశ్ ఝూ నిర్మించిన ఈ చిత్రానికి తుషార్ అమ్రిష్ గోయెల్ దర్శకత్వం వహించారు. ఈ నెల 31న థియేటర్లలో విడుదల కానుందీ సినిమా.

## ప్రతి సినిమా విషయంలోనూ అలాగే ఆలోచిస్తా: శ్రీలీల



రవితేజతో కలిసి మరోసారి సందడి చేయడానికి సిద్ధమయ్యారు నటి శ్రీలీల. వీరిద్దరి కాంబినేషన్‌లో రానున్న చిత్రం 'మాస్ జాతర' . భాను భోగవరపు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో శ్రీలీల వరుస ఇంటర్వ్యూలతో ప్రచారం జోష్ పెంచారు."ప్రతి సినిమాతోనూ ఏదో కొత్త విషయం నేర్చుకుంటూనే ఉంటాను. చిన్నప్పటి నుంచి ఎప్పుడూ బిజీగా ఉండడం అలవాటు. స్కూల్ అయిపోగానే డ్యాన్స్ క్లాస్, అది పూర్తయ్యాక వీణ క్లాస్, తర్వాత స్విమ్మింగ్, మధ్యలో ట్యూషన్.. ఇలా రోజంతా బిజీగానే ఉండేదాన్ని. ఇప్పటికీ అలానే బిజీగా ఉంటాను. రోజంతా ఖాళీగా ఉన్న రోజులు చాలా తక్కువ. ఇప్పుడు కూడా ఒకవైపు కలర్‌ఫుల్ కాస్ట్యూమ్స్, మరోవైపు మెడిసిన్ చేస్తున్నా కాబట్టి వైట్ కోట్.. రెండూ పూర్తిగా భిన్నమైనవి. అందుకే బోర్ కొట్టదు. రెండింటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ వెళ్తున్నా""నాకుస్నేహితులు కూడా తక్కువమంది ఉన్నారు. వాళ్లతోనే ఎంజాయ్ చేస్తుంటా. నలుగురిని నవ్వించడమంటే నాకెంతో ఇష్టం. నేను చేసే సినిమాలు కుటుంబమంతా కూర్చుని చూసేలా ఉండాలని అనుకుంటాను. ప్రతి సినిమాకు అలాగే ఆలోచిస్తాను. కానీ, మారుతున్న రోజులతో పాటు మనం కూడా మారుతూనే ఉండాలి కదా.. అందుకే ఎప్పటికీ ఇలానే ఉంటాను అని చెప్పలేను. 'మాస్ జాతర'లో రొటీన్‌కు భిన్నంగా కొంచెం మాస్‌గా ట్రై చేశాను. అందరికీ నచ్చుతుందని అనుకుంటున్నా" అని చెప్పారు.




## 'కింగ్'లో బ్రహ్మానందం కామెడీ.. 'హిందోళంలో 'రి' ఉండదు' ఈ సీన్ అలా చేశారు

కామెడీకి యాక్షన్ జోడించి, ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని పంచిన దర్శకుడు శ్రీను వైట్ల ఆయన తీసిన ప్రతీ చిత్రంలో సెపరేట్ కామెడీ ట్రాక్ ఉంటుంది. 'కింగ్' మూవీలో బ్రహ్మానందం సీన్స్ ఎప్పుడు చూసినా నవ్వాగదు. సంగీతంలో ఏమీ తెలియకపోయినా అన్నీ తెలిసిన మ్యూజిక్ డైరెక్టర్ జయ సూర్యగా ఆయన నటన మరో స్థాయిలో ఉంటుంది. ఇక సింగర్స్ కాంపిటీషన్‌కు వచ్చి అన్నీ తెలిసినట్లు సలహాలు, సూచనలు ఇచ్చే ఎపిసోడ్ సినిమాలోని బెస్ట్ కామెడీ సీన్స్‌లో ఒకటి. అందులో ఓ సింగర్ పాడుతుంటే మ్యూజిక్ డైరెక్టర్ జయసూర్య తప్పులు వెతుకుతాడు. హిందోళంలో 'రి' ఏది? అని అడిగి, నవ్వుల పాలవుతాడు. అయితే, దాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఇంకేవో సాకులు చెబుతాడు. తొలుత అనుకున్న షెడ్యూల్‌లో ఆ సన్నివేశం లేదట. సెట్స్‌లో మాటల సందర్భంగా 'హిందోళ' రాగం గురించి చర్చ జరగ్గా, శ్రీను వైట్ల అప్పటికప్పుడు ఆ సీన్ క్రియేట్ చేశారు. ఓ సందర్భంలో ఆయన ఈ విషయాన్ని పంచుకున్నారు."నేను ఎక్కువగా ఆర్టిస్ట్‌లతో మాట్లాడుతూ సరదాగా సీన్స్ (%ఖఱఅస్త్ర వీశీజఱవ జశీఎవసఎ ాొషవఅవం%) తీస్తూ ఉంటాను. మ్యూజిక్ డైరెక్టర్ అయిన బ్రహ్మానందం కాంపిటీషన్స్‌కు వస్తాడు. అప్పుడు ఒక అమ్మాయి పాట పాడాలని మాత్రమే అనుకున్నాం. ఆ సీన్ నిజమైన సింగర్‌తో చేద్దామని పిలిపించాం. సీన్ గురించి మాట్లాడుతూ 'షోకు వచ్చిన మ్యూజిక్ డైరెక్టర్ సింగర్స్ మిస్టేక్స్ చూపిస్తూ తన ఆధిపత్యాన్ని చూపిస్తూ ఉంటాడు. నిజానికి అతడికి ఏమీ తెలియదు. కరెక్ట్‌గా పాడినా ఏదో ఒక సాకు చెబుతాడు' అని సీన్ ఆమెకు వివరించా. అప్పుడు హిందోళం గురించి ఆ అమ్మాయి చెబుతూ, ఆ రాగంలో 'రి' ఉండదు అని చెప్పింది. దాంతో అప్పటికప్పుడు నేను సన్నివేశం రాసుకొని తీశాను. అది బాగా వర్కవుట్ అయింది. దేవిశ్రీ ప్రసాద్ రీ–రికార్డింగ్ చేస్తున్నప్పుడు నన్ను పిలిచి "భయ్యా... మీకు హిందోళంలో 'రి' ఉండదని ఎలా తెలుసు" అని అడిగాడు.

## బాక్సాఫీస్ నంబర్లు.. నా తండ్రిని ప్రభావితం చేయలేవు



నిజం మాట్లాడితే.. వేలెత్తి చూపేవాళ్లే ఎక్కువ ఉంటారని అంటోంది అందాల తార శ్రుతి హాసన్. తనదైన నటనతో సినీప్రియుల్ని ఆకట్టుకుంటూనే.. మరోవైపు గాయకురాలిగా తన పాటలతో మురిపిస్తుంటుంది భామ. ఇటీవలే అగ్రహీరో రజనీకాంత్‌తో కలిసి 'కూలీ' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించిన ఈమె.. త్వరలో విజయ్ సేతుపతి సరసన 'ట్రైన్'తో తెరపై సందడి చేయనుంది. ఈ నేపథ్యంలోనే ఓ ఆంగ్ల మీడియాతో ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రుతి.. తనపై వస్తోన్న విమర్శలు, తన తండ్రి గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.

ఈ విషయాన్ని ఆయన దగ్గరే నేర్చుకున్నా

"నేను కమల్ హాసన్ కుమార్తెగా వెండితెరకు పరిచయమయ్యాను. కాబట్టి నాపై ఆయన ప్రభావం చాలా ఉంటుంది. నా నటనను ఆయన యాక్టింగ్‌తో పోలుస్తుంటారు. కానీ దాని వల్ల నేనెప్పుడూ ఇబ్బంది పడలేదు. ఆయన ఎప్పుడూ నా వెంట ఉండడం నా అదృష్టంగా భావిస్తాను. చిత్రపరిశ్రమలోని ఎంతోమందిలో మా నాన్న స్ఫూర్తి నింపారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని ఆయన దగ్గర నుంచే నేర్చుకున్నా. మా నాన్న తన సొంత డబ్బు పెట్టి సినిమా తీసిన సందర్భాలు ఉన్నాయి. ఆయనది బాక్సాఫీసు నంబర్ల గురించి ఆలోచించే మనస్తత్వం కాదు. వాటి గురించి పట్టించుకోకుండా తన పని తాను చేసుకుంటారు. అందుకే బాక్సాఫీసు నంబర్లు నా తండ్రిని ప్రభావితం చేయలేవు".

ఇక్కడ అన్నింటిలోనూ క్రమశిక్షణే

"నేను చాలా సందర్భాల్లో కాస్మోటిక్ సర్జరీ చేయించుకోవడం గురించి బహిరంగంగా మాట్లాడాను. దీనిపై కొందరు 'ఈమె ప్లాస్టిక్ సర్జరీల దుకాణం' అంటూ నాపై విమర్శలు చేశారు. కానీ ఏం చేశానో.. ఎలా చేశానో నాకు మాత్రమే తెలుసు. నిజాయతీగా ఉంటే మీరు చెల్లించే మూల్యం ఇది. అయినా ఇది నా వ్యక్తిగత నిర్ణయం. ప్రేమలో, పనిలో, జీవితంలో.. ఇలా ఎప్పుడైనా మీరు నిజం మాట్లాడితే వేలెత్తి చూపేవాళ్లు ఎక్కువ ఉంటారు. అయినా బయట వాళ్లు ఏదో అనుకుంటారని భయపడకుండా నేనెంటో అలాగే ఉండటానికి ఇష్టపడతా. అలానే జీవిస్తా".

"నేను దక్షిణాదితో పాటు.. ఇటు బాలీవుడ్‌లోనూ పనిచేశాను. నేను గమనించింది ఏంటంటే.. దక్షిణాది తారలు ఎక్కువ వినయం, గౌరవంగా ఉంటారు. అంటే అక్కడ సంస్కృతి సంప్రదాయాలకు ప్రాధాన్యత ఎక్కువ. సినిమా ప్రారంభంలో కొబ్బరి కాయ కొట్టడం, పూజలు చేయడం లాంటి విషయాలు నేను ఎప్పుడూ గమనిస్తూనే ఉంటాను. పరిశ్రమలోకి అడుగుపెట్టినప్పుడు తొలినాళ్లలో ఇదంతా కొత్తగా అనిపించింది. ఎందుకంటే మా ఇంట్లో ఎక్కువగా ఆచారాలను నమ్మరు. సెట్లో దేన్ని అనుమతించాలి అనే దానిపై కొన్ని నియమాలు ఉన్నాయి. ప్రతి విషయంలోనూ క్రమశిక్షణ ఉంటుంది. కానీ బాలీవుడ్‌లో పనిచేసినప్పుడు అది అంతగా కనిపించలేదు.



# ఐసీయూలో శ్రేయస్ అయ్యర్!

## పక్కటెముకల వద్ద తీవ్రగాయం

: సిడ్నీ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో టీమ్ఇండియా అద్భుత విజయం సాధించింది. అయితే, ఫీల్డింగ్ చేస్తుండగా భారత ఆటగాడు శ్రేయస్ అయ్యర్ గాయపడ్డాడు. క్యాచ్ అందుకొనే క్రమంలో బలంగా నేలను తాకాడు. దీంతో అతడి ప్లీహానికి తీవ్ర గాయమైంది. వెంటనే మైదానం వీడిన అతడిని బీసీసీఐ వైద్యబృందం ఆసుపత్రికి తరలించింది. అయితే, తాజాగా అతడిని ఐసీయూలో చేర్చినట్లు వార్తలు వస్తున్నాయి. అంతర్గతంగా రక్తస్రావం కావడంతోనే మేనేజ్‌మెంట్ ఈ నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది.

"శ్రేయస్ అయ్యర్ ప్లీహానికి గాయమైంది. అతడి పరిస్థితిపై వైద్యబృందం టెస్టులు చేయించింది. ఆ రిపోర్టులు వచ్చాయి. అంతర్గతంగా రక్తస్రావం జరిగినట్లు పరీక్షల్లో తేలింది. దీంతో వెంటనే అతడిని ఐసీయూలో చేర్చాం. కనీసం రెండు రోజుల నుంచి ఏడు రోజులపాటు అతడు అబ్జర్వేషన్‌లో ఉంటాడు. బ్లీడింగ్ ఆగిపోవడం, ఇన్ఫెక్షన్ కాకుండా ఉంటే అప్పుడు తదుపరి చర్యలు తీసుకుంటాం. టీమ్ వైద్యుడు, ఫిజియో ఎలాంటి రిస్క్ తీసుకోకుండా శ్రేయస్‌ను ఆసుపత్రిలో చేర్చారు.

లేకపోతే ప్రాణాల మీదకు వచ్చి ఉండొచ్చు. ప్రస్తుతం అతడి పరిస్థితి కాస్త నిలకడగానే ఉంది. శ్రేయస్ దృఢమైన వ్యక్తి. తప్పకుండా త్వరలోనే కోలుకుని తిరిగి వస్తాడు" అని క్రికెట్ వర్గాలు వెల్లడించాయి.

బీసీసీఐ కూడా అధికారికంగా అతడి గాయం పరిస్థితిపై అప్‌డేట్ ఇచ్చింది. ఎడమ పక్కటెముకుల వద్ద ప్లీహానికి తీవ్ర గాయం కావడంతో అతడిని ఆసుపత్రిలో చేర్చినట్లు అందులో పేర్కొంది. అయితే ఐసీయూలో ఉంచినట్లు మాత్రం ప్రస్తావించలేదు.

కానీ, అతడు ఐసీయూలోనే ఉన్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి. మరోవైపు తమ కుమారుడిని చూసేందుకు ఆస్ట్రేలియా వీసాలు మంజూరు చేయాలని ఇప్పటికే శ్రేయస్ అయ్యర్ కుటుంబం కోరినట్లు తెలుస్తోంది.

## కిడ్నీని టచ్ చేసేలా యాక్షన్: అక్షర్‌పై బుమ్రా సరదా ట్రోలింగ్



టీమ్ఇండియా ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉంది. ఇప్పటికే మూడు వన్డేల సిరీస్ ముగిసింది. బుధవారం నుంచి ఆసీస్‌తో ఐదు టీ20ల సిరీస్ మొదలు కానుంది. ఈ క్రమంలో భారత ప్లేయర్లంతా ప్రాక్టీస్‌తో బిజీగా ఉన్నారు. అయితే, అక్షర్ పటేల్‌కు సంబంధించి ప్రమోషనల్ వీడియో ఒకటి నెట్టింట వైరల్‌గా మారింది. దానికి కారణం జస్‌ప్రీత్ బుమ్రా కామెంట్‌తో ట్రోలింగ్ చేయడమే. బుమ్రా స్పందనకు అక్షర్ కూడా సరదాగా కౌంటర్ ఇచ్చాడు.

ఓ కంపెనీకి చెందిన యాడ్‌లో అక్షర్ పటేల్ నటించాడు. ఆ వీడియోను చూసిన బుమ్రా . " కిడ్నీ టచింగ్ యాక్టింగ్" అని నవ్వుతున్న ఎమోజీలను పెట్టాడు.

దానికి ప్రతిస్పందిస్తూ 'థ్యాంక్స్ బ్రో. వచ్చేసారి నా యాక్టింగ్ నీ మునివేళ్లను తాకేలా ఉంటుంది" అని అక్షర్ పటేల్ సమాధానం ఇచ్చాడు.

ఆసీస్ జట్టులోకి సంఘా

భారత్‌తో ఐదు టీ20ల సిరీస్ కోసం ఆడమ్ జంపా స్థానంలో తన్వీర్ సంఘాను ఆసీస్ రీప్లేస్ చేసింది. వ్యక్తిగత కారణాలతో ఆడమ్ జంపా సిరీస్‌కు దూరమవుతున్నాడు. జంపా సతీమణి హారియట్ రెండో బిడ్డకు జన్మనివ్వనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. భారత కాలమానం ప్రకారం టీ20 మ్యాచులన్నీ మధ్యాహ్నం 1.45 గంటలకు మొదలవుతాయి.

ఐదు టీ20ల సిరీస్ ఇలా..

కాన్‌బెర్రా వేదికగా అక్టోబర్ 29న తొలి మ్యాచ్

మెల్‌బోర్న్ వేదికగా అక్టోబర్ 31న రెండో మ్యాచ్

హెూబర్ట్ వేదికగా నవంబర్ 2న మూడో మ్యాచ్

గోల్డ్ కోస్ట్ వేదికగా నవంబర్ 6న నాలుగో మ్యాచ్

బ్రిస్బేన్ వేదికగా నవంబర్ 8న ఐదో టీ20



## గిల్ 'డబుల్' ఫెయిల్యూర్.. పాఠాలు నేర్వాలి.. టీమ్‌ను పట్టాలెక్కించాలి

టీమ్ఇండియా 'యువరాజు'కు కంగారూల గడ్డపై పరాభవం. టెస్టుల్లో సారథ్య బాధ్యతలు అందుకున్నాక ఇంగ్లాండ్‌లో పరుగుల వరద పారించిన 'ప్రిన్స్'.. వన్డేల్లో ఆస్ట్రేలియాలోనూ లోనూ అదరగొడతాడని అభిమానులు ఆశ పడ్డారు. అయితే కంగారూల జిమ్మిక్కులు అర్థం చేసుకోలేక బ్యాటర్‌గా ఫెయిలై, సారథిగానూ సరైన మార్కులు సాధించలేకపోయాడు. విజయం కంటే ఓటమి ఎక్కువ పాఠాలు నేర్పిస్తుంది అంటారు. మరి ఈ ఓటమి నుంచి గిల్ ఏం నేర్చుకోవాలి. రోహిత్ శర్మ స్థానంలో వన్డే కెప్టెన్‌గానూ నియమితుడైన గిల్ ఆసీస్ వన్డే సిరీస్‌లో ఏ మ్యాచ్‌లోనూ 30కి పైగా స్కోరు చేయలేదు. ఈ సిరీస్‌లో అతను చేసిన మొత్తం పరుగులు 43 అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మూడు మ్యాచ్‌ల్లోనూ గిల్ పేసర్ల బౌలింగ్‌లోనే ఔటయ్యాడు. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే కంగారూలు పకడ్బందీగా ప్లాన్ చేసి ఔట్ చేశారు. బౌన్సీ పిచ్‌లకు అలవాటు పడలేదో లేక వరుస మ్యాచ్‌ల బడలిక వల్లనో కానీ.. మూడుకి మూడు మ్యాచ్‌ల్లో శుభ్‌మన్‌ని మడతెట్టేశారు. మూడో వన్డేలో ఓ మోస్తరు పరుగులు చేసినా.. రో–కో షోతో పోలిస్తే అవి చాలా చాలా తక్కువ.

ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ నుంచి మొదలు.. భారత్ ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ గిల్ ఆడాడు. విరామం లేకుండా మ్యాచ్‌లు ఆడితే ఎంతటి ప్లేయరైనా ఇబ్బందిపడతాడు. ఇప్పుడు గిల్ విషయంలో అదే జరిగిందని కొంతమంది ఫ్యాన్స్ అంటున్నారు. త్వరలో ఆసీస్‌తో ప్రారంభం కానున్న ఐదు టీ20ల సిరీస్‌కు గిల్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. భవిష్యత్‌లో ఇతను పొట్టి ఫార్మాట్‌కు కూడా కెప్టెన్ అయ్యే అవకాశాలున్నాయి. వచ్చే ఏడాది ఆరంభంలోనే టీ20 ప్రపంచ కప్ జరగనుంది. ఇలా వరుసపెట్టి మ్యాచ్‌లు ఆడిస్తే కీలక టోర్నీకి ముందు గాయపడితే జట్టుకు తీరని నష్టం జరుగుతుంది.

టాస్ ఎఫెక్ట్ కూడా..

వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుని గిల్ పనిభార నిర్వహణ విషయంలో మేనేజ్‌మెంట్ దృష్టి పెట్టాల్సిన అవసరముంది. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో శుభ్‌మన్ కెప్టెన్సీపై టాస్ ఎఫెక్ట్ కూడా ఉంది. మూడు మ్యాచ్‌ల్లోనూ అతను టాస్ గెలవలేదు. దీంతో అనుకున్నవిధంగా ప్రణాళికలు అమలు చేయలేకపోయాడు. కెప్టెన్సీ ఒత్తిడి కూడా అతడి బ్యాటింగ్‌పై ప్రభావం చూపించి ఉండొచ్చు. స్వదేశంలో నవంబర్ – డిసెంబర్‌లో సఫారీలతో, జనవరిలో కివీస్‌తో మూడేసి వన్డేలు ఆడనుంది. ఆ సిరీస్‌ల్లో గిల్ ఇటు బ్యాటర్‌గా, అటు సారథిగా సత్తా చాటి వన్డేల్లోనూ తాను ప్రిన్స్ అని నిరూపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే జట్టును తిరిగి విన్నింగ్ ట్రాక్ ఎక్కించాలి. అన్నట్లు తన చేతుల్లో లేకపోయినా టాస్‌లు కూడా గెలవాలి.

## గాయంతో వరల్డ్‌కప్‌నకు

# దూరమైన ప్రతీక రావల్



మహిళల వన్డే ప్రపంచకప్‌లో భాగంగా బంగ్లాదేశ్‌తో నిన్న (ఆదివారం) జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో టీమ్ఇండియా బ్యాటర్ ప్రతీక రావల్ ఫీల్డింగ్ చేస్తూ గాయానికి గురైంది. దీంతో ఆమె వరల్డ్‌కప్‌లో మిగతా మ్యాచ్‌లకు దూరమైనట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని బీసీసీఐ అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. బౌండరీ రోప్స్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న ప్రతీక బంతిని ఆపే క్రమంలో మైదానంలో జారిపడింది. దీంతో ఆమె కాలికి గాయమైంది. ఈ మ్యాచ్ వర్షం వల్ల ఆగిపోయిన విషయం తెలిసిందే.

ఔట్‌ఫీల్డ్‌లో తడి పరిస్థితి వల్ల జారి, గాయపడిన అనంతరం ప్రతీక నొప్పితో విలవిల్లాడింది. టీమ్ సపోర్టింగ్ స్టాఫ్ సాయంతో ఆమె మైదానాన్ని వీడింది. సెమీఫైనల్‌కు ముందు ఇది భారత మహిళల జట్టుకు పెద్ద ఎదురు దెబ్బే అని చెప్పాలి. గురువారం (అక్టోబర్ 30) టీమ్ఇండియా, ఆస్ట్రేలియాతో తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌కు ఆమె అందుబాటులో ఉండే అవకాశాలు కనిపించడం లేదు. ఒక వేళ టీమ్ఇండియా ఫైనల్‌కు చేరుకున్నా.. ఆమె ఆడేది అనుమానమే!

ఈ వరల్డ్ కప్‌లో ప్రతీక రావల్ ఇప్పటి వరకు బ్యాట్‌తో చక్కగా రాణించింది. న్యూజిలాండ్‌తో జరిగిన గత మ్యాచ్‌లో ఆమె సెంచరీ కూడా సాధించింది. అలాగే ఒక క్యాలెండర్ ఇయర్‌లో 1000 పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచింది. అలాగే వికెట్ కీపర్ రిచాఘోష్ కూడా గాయంతో బాధపడుతోంది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆమె చేతి వేలికి గాయమైంది. దీంతో ఆమె బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆడలేదు. ఆమె స్థానంలో ఉమా ఛెత్రీ.. వికెట్ కీపర్‌గా వ్యవహరించింది. అయితే సెమీఫైనల్‌లో రిచాఘోష్ ఆడే విషయంలో ఇంకా స్పష్టత రాలేదు.

## 'యాంకర్' పాత్రకు సెండాఫ్..

# ఇదంతా నవతరం టీ20 బ్యాటింగ్



కాస్త నెమ్మదిగా ఆడదాం.. బౌలర్‌ను బట్టి ఆచితూచి షాట్లు కొడదాం.. అంటే ఇప్పుడు కుదరదు. ప్రస్తుతం పద్ధతంతా మారిపోయింది. వచ్చామా? దూకుడుగా ఆడేశామా..? ఇదే ఇప్పటి టీ20 ఫార్ములా. గత టీ20 ప్రపంచ కప్ నుంచి పరిస్థితులు చాలా వరకూ మారిపోయాయి. మరో ఆరు నెలల్లో మళ్లీ పొట్టి కప్ రానుంది. అప్పటికి మరిన్ని మార్పులు చూసే అవకాశం లేకపోలేదు. భారత్ – ఆసీస్ మధ్య ఐదు టీ20ల సిరీస్ నేపథ్యంలో పొట్టి ఫార్మాట్ 'దూకుడు'పై ఓ లుక్కేద్దాం..

టీ20 క్రికెట్‌లో భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌దే తొలి మూడు స్థానాలు. బ్యాటింగ్‌లోనూ కొత్త రికార్డులను నెలకొల్పుతూ ముందుకు సాగుతున్నాయి. 2024 టీ20 ప్రపంచ కప్ నుంచి చూస్తే బ్యాటింగ్‌లోని అన్ని పారామీటర్లల్లోనూ మూడింటిదే ఆధిపత్యం. రన్‌రేట్, బౌండరీల పర్సంటేజీ, సగటు, బాల్స్ ఫర్ సిక్స్.. ఇలా ప్రతిదాంట్లోనూ దూకుడునే ఫాలో అవుతున్నాయి. ఇక భారత్ అయితే రెండుసార్లు 300 పరుగుల మైలురాయి వద్దకు వచ్చింది. ఇప్పటి వరకు టీ20ల్లో మూడుసార్లు మాత్రమే 300ం స్కోరు నమోదైంది. అందులోనూ బలమైన జట్లు ఇంగ్లాండ్ – దక్షిణాఫ్రికా తలపడిన మ్యాచ్ ఒకటే ఉంది. మిగతా మ్యాచులు జింబాబ్వే %జం% గాంబియా, నేపాల్ %జం% మంగోలియా ఎదురుపడటం గమనార్హం. టెస్టులు ఆడే దేశాల్లో ఇంగ్లాండ్‌దే (304/2) అత్యధిక స్కోరు. ఆ తర్వాత భారత్ (297/6) పేరిట ఉంది.

మనమే టాప్

జులై 2024 నుంచి ఇప్పటి వరకు టీమ్ఇండియా 27 టీ20లను ఆడింది. అందులో కేవలం మూడు మ్యాచుల్లోనే ఓడింది. అంటే 88.9 శాతంతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత ఆస్ట్రేలియా 84.2 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. వచ్చే ఏడాది జరగనున్న టీ20 ప్రపంచ కప్‌లో భారత్, ఆసీస్ టైటిల్ ఫేవరెట్లుగా బరిలోకి దిగనున్నాయి. 2024లో జరిగిన పొట్టి కప్‌ను రోహిత్ శర్మ నాయకత్వంలోని టీమ్ఇండియా గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అత్యంత ప్రమాదకరమైన ఆసీస్‌తో ఆడేందుకు భారత్ వచ్చింది. ఇరు జట్లలోనూ స్టార్ ఆటగాళ్లు లేకపోవడం గమనార్హం. రోహిత్, విరాట్, రవీంద్ర జడేజా టీ20లకు వీడ్కోలు పలకగా.. ఆసీస్ నుంచి డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్, మాథ్యూ వేడ్, మిచెల్ స్టార్క్ గుడ్‌బై చెప్పారు. ఇప్పుడీ సిరీస్‌లో ప్యాట్ కమిన్స్ కూడా ఆడటంలేదు. గత వరల్డ్ నుంచి ఒక్క టీ20లోనూ ఆడలేదు. అయితే, కుర్రాళ్లతో కూడిన భారత్ – ఆసీస్ మధ్య పోరు ఈసారి మరింత ఆసక్తికరంగా ఉండటం ఖాయం.

దూకుడే మంత్రం..

> . ప్రస్తుతం అభిషేక్ టీ20ల్లో వరల్డ్ నంబర్ వన్ బ్యాటర్. అతడి స్ట్రైక్‌రేట్ 200 చేరువగా ఉంది. యశస్వి జైస్వాల్ కూడా 160ం స్ట్రైక్‌రేట్‌తో ఆడుతున్నాడు. కొత్త తరంలో ఎవరూ కూడా కాసేపు క్రీజ్‌లో ఉందామనుకోవడం లేదు. దూకుడుగా ఆడేందుకే మొగ్గు చూపుతున్నారు.

మొన్నటి వరకూ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఓపెనర్లుగా వచ్చేవారు. రోహిత్ హిట్టింగ్ చేయగా.. విరాట్ 'యాంకర్' పాత్ర పోషించాడు. అదను చూసి దూకుడు పెంచేవాడు. ఇప్పుడు వీరిద్దరి స్థానంలో యువ ఆటగాళ్లు అభిషేక్ శర్మ, యశస్వి జైస్వాల్ వచ్చారు. ఇద్దరూ ఎడమ చేతివాటం బ్యాటర్లే. అయినా సరే ఒకరినిమించి మరొకరు ఎటాకింగ్ గేమ్ ఆడుతూ ప్రత్యర్థులపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రస్తుతం అభిషేక్ టీ20ల్లో వరల్డ్ నంబర్ వన్ బ్యాటర్. అతడి స్ట్రైక్‌రేట్ 200 చేరువగా ఉంది. యశస్వి జైస్వాల్ కూడా 160ం స్ట్రైక్‌రేట్‌తో ఆడుతున్నాడు. కొత్త తరంలో ఎవరూ కూడా కాసేపు క్రీజ్‌లో ఉందామనుకోవడం లేదు. దూకుడుగా ఆడేందుకే మొగ్గు చూపుతున్నారు. అలాగని మరీ మూర?ంగా చెత్త షాట్లకూ పోవడం లేదు. సరైన టైమింగ్‌తో బంతిని బౌండరీ దాటించేస్తున్నారు. ఒక మ్యాచ్‌లో విఫలమైనంత మాత్రాన ఆ ఫార్ములాను ఆపేది లేదని ఇప్పటికే భారత కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. మరోవైపు ఆస్ట్రేలియా కూడా ఇదే తరహాలో ఆడుతోంది. ఇప్పుడు ప్రతి బ్యాటర్ కూడా ఫినిషర్ పాత్ర పోషించాల్సిందే. కాసేపు ఆచితూచి ఆడదామనే 'పాతతరం' ఆటను అభిమానులూ ఇష్టపడటం లేదు.

# జనం కబ్జాలు చూస్తూ ఊరుకుండట్లే..!

* **హైడ్రాకు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు**
* **నేడు హైడ్రా ప్రజావాణికి 52 ఫిర్యాదులు**

హైదరాబాద్, అక్టోబరు 27 (భారత శక్తి): కబ్జాలు జరుగుతుంటే నగర ప్రజలు చూస్తూ ఊరుకోవడంలేదు.నేరుగా హైడ్రా కార్యాలయానికి వచ్చి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నారు.రహదారి బంద్ అయితే ఫొటోలు తీసి మరీ చూపిస్తున్నారు. చెరువుల్లో ఆక్రమణలు జరుగుతుంటే వీడియోలు పెడుతున్నారు. ఎవరెవరికి ఫిర్యాదు చేశారో కూడా చెప్పి సాక్ష్యాలను చూపిస్తున్నారు.దశాబ్దాల నాటి సమస్యలకు గంటల్లో, రోజుల్లో పరిష్కారం చూపుతున్నారంటూ హైడ్రాకు కితాబిస్తున్నారు. ఆ నమ్మకంతో వస్తున్నామంటూ పలువురు ఫిర్యాదు చేస్తున్నారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి 52 ఫిర్యాదులందాయి. చాలామంది బాహాటంగా ఫిర్యాదు చేస్తుంటే.. మరి కొంతమంది తమ వివరాలు బయటపెట్టవద్దని విచారణాధికారులకు సూచిస్తున్నారు. బాలానగర్ మండలం కూకట్‌పల్లిలోని హస్మత్‌పేట విలేజ్‌లో ప్రభుత్వానికి చెందాల్సిన 10 ఎకరాలు కబ్జా చేసేస్తున్నారంటూ హైడ్రాకు ఫిర్యాదు అందింది. తూములు మూసేసి.. అలుగులు ఎత్తు పెంచడంతో చెరువుపై భాగంలో ఉన్న భూములు, లే ఔట్‌లు నీట మునగుతున్నాయని కొంత మంది, చెరువుల్లో మట్టి పోసి ఎకరాలకొద్దీ కబ్జా చేస్తున్నారంటూ మరికొంతమంది ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేరుగా పరిశీలించి సంబంధిత అధికారులకు పరిష్కార బాధ్యతలను అప్పజెప్పారు.

**ఫిర్యాదులు ఇలా..**

* శంషాబాద్ మండలంలోని పెద్దగోల్కొండ గ్రామం పరిధిలోని సరసింహకుంట తూములు మూసేసి.. అలుగు ఎత్తు పెంచడం వల్ల ఎఫ్‌టీఎల్ కంటే ఎక్కువ నీరు నిలిచి తమ పంట పొలాలు మునిగిపోయాయని ఆ గ్రామ ప్రజలు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వాస్తవంగా చెరువు ఎంత విస్తీర్ణంలో ఉందో అంతే నీరు నిండేలా చూసి తమ పొలాలను రక్షించాలని కోరారు. చెరువు స్థాయికి మించి నిండడంతో ఆ నీరు ఔటర్ రింగు రోడ్డు ఎగ్జిట్ 15 వద్ద సర్వీసు రోడ్డును ముంచెత్తుతోందని.. దీంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు.
* సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ, మండలంలోని బీరంగూడలో ఉన్న శాంబుని కుంట కబ్జాలకు గురి అవుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 756లో ఉన్న ఈ చెరువు వాస్తవ విస్తీర్ణం 22.11 ఎకరాలు కాగా.. ప్రస్తుతతం ఆరేడు ఎకరాలకు పరిమితమైందని వాపోయారు. చెరువులో మట్టిపోసి ఆక్రమణలకు పాల్పడుతున్నారని హైడ్రా చర్యలు తీసుకోకపోతే ఆ చెరువు కనుమరుగౌతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.




* సాగర్ రోడ్డులో ఉన్న యశోదనగర్ కాలనీలో శివారు ఇంటి స్థలాల వారు రోడ్డును కలిపేసుకుని దారి లేకుండా చేస్తున్నారని యశోదనగర్ కాలనీ రెసిడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. మరో రోడ్డును ఆక్రమించేసి 107 గజాల ప్లాట్ స్థలంగా చూపిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో లే ఔట్‌లోని రహదారులు దాటాలంటేనే కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని వాపోయారు.
* కూకట్‌పల్లి ప్రాంతంలో పరికి చెరువులో సుమారు 12 ఎకరాల మేర రాత్రికి రాత్రి మట్టిపోసి నింపుతున్నారని.. నంబరు ప్లేటు లేని వాహనాలను వినియోగిస్తున్నారని అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు. 18 అంతస్తుల అపార్టుమెంట్ ను నిర్మించి అమ్మేసేందుకు సిద్ధం అవుతున్నారని.. వెంటనే హైడ్రా ఆపాలని కోరారు. లేని పక్షంలో అందులో ప్లాట్లు కొన్న వారు మోసపోయే ప్రమాదం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.
* అమీన్‌పూర్ పెద్ద చెరువులో కూడా మట్టిపోసి.. భవన నిర్మాణాలు చేపడుతున్నారని.. అడ్డుకున్న తమపై దాడి చేయడమే కాకుండా.. స్థానిక పోలీసు స్టేషన్లో కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు.
* మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని బాలానగర్ మండలం, హస్మత్‌పేట్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణలపై ఓల్డ్ బోయిన్‌పల్లి నివాసులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 1లోని 28.28 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానిక రాజకీయ నాయకులు ఆక్రమించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిజాం కాలం నాటి చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ భూమిని 1953లో పురావస్తు శాఖ గెజిట్ బుక్ లో కూడా యాడ్ చేసింది.కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన స్థానిక నాయకులతో పాటు వారి అనుచరులు ఈ భూమిని రియల్ ఎస్టేట్ వెంచర్‌గా మలచి చిన్నచిన్న ప్లాట్లుగా అమ్మేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



## నిరు పేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పట్టాలను అందించిన మల్ రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 27 (భారత శక్తి): అబ్దుల్లాపూర్ మెట్ మండలం గండిచెరువు, లస్కర్ గూడ, అనాజ్ పూర్, మజీద్ పూర్, ఇనాంగూడ,పిగ్లిపూర్, బండ రావిర్యాల గ్రామాలలో అదనంగా మంజూరైన 36 మందికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ సర్టిఫికెట్లను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి లబ్ధిదారులకు అందించారు. ఇండ్లు లేని అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి అండగా ఉంటున్నామని తెలిపారు. ప్రజాపాలనలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. లబ్ధిదారులు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని అపర భగీరథుడు, పేదల పెన్నిధి అందరికీ అండగా ఉండే మహా నాయకుడని చెప్పి మాకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చినందుకు ఎప్పుడు గుర్తు పెట్టుకుంటామని ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సిహెచ్ భాస్కర్ చారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్త ప్రభాకర్, మాజీ సర్పంచ్లు జక్క సంజీవరెడ్డి కావాడి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మేడిపల్లి వెంకటేష్ గౌడ్, కోట ప్రభాకర్ రెడ్డి, దర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల వారోత్సవాలు... సైకిల్ ర్యాలీ

ఎల్బీనగర్, అక్టోబర్ 27 (భారత శక్తి): పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ సరూర్నగర్ సీఐ సైదిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సైదిరెడ్డి మాట్లాడుతూ, చట్టం అందరికీ సమానమని, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని ప్రజలకు,విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత తెలంగాణలో నెలకొన్న ప్రశాంత వాతావరణం,శాంతి భద్రతలు పోలీసు అమరవీరుల త్యాగాల ఫలితమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు గంగాధర్ రెడ్డి, మారయ్య, వెంకటేశ్వర్లు, మహేందర్,లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## 24 గంటల్లో నిందితుల అరెస్ట్ : సిపి సుధీర్ బాబు

* **గోరక్షక కార్యకర్తపై కాల్పుల కేసు..**
* **పోలీసులకు అభినందనలు..**
* **సీపీ సుధీర్ బాబును కలిసిన గోరక్షక్ సభ్యులు..**



ఎల్బీనగర్, అక్టోబర్ 27 (భారత శక్తి) : గోరక్షక కార్యకర్తపై కాల్పులు జరిపిన కేసులో 24 గంటల్లో నిందితులను పట్టుకోవడం పోలీసులను అభినందించదగ్గ విషయమని గోరక్షక్ సభ్యులు అన్నారు. సోమవారం రోజు గోరక్షక్ సభ్యులు రావుల శ్రీకాంత్ తదితరులు వచ్చి రాచకొండ సీపీ సుధీర్ బాబు ఐపిఎస్ ను నేరడ్మెట్ ఆఫీసులో కలిసి కృతజ్ఞతలు తెలుపడం జరిగింది. రాచకొండ పోలీసులు ఘట్కేసర్ లో గోరక్షక కా ర్యకర్త బిడ్ల ప్రశాంత్ పై కాల్పులు జరిపిన కేసులో 12 గంటల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే.




## అనాథ గృహ అధ్యక్షులు మార్గం రాజేష్ కు బ్రహ్మకుమారీల సన్మానం

ఎల్బీనగర్, అక్టోబర్ 27(భారత శక్తి): దీపావళి పండుగ సందర్భంగా హిమాయత్ నగర్ లోని బ్రహ్మ కుమారీల శాంతి నిలయంలో బ్రహ్మకుమారీలచే "ఆత్మ జ్యోతి వెలిగించుట" అనే కార్యక్రమం సందర్భంగా వివిధ రంగాలలో సామాజిక సేవలు అందిస్తున్న ప్రముఖులను ఘనంగా సన్మానించే కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన హిమాయత్ నగర్ బ్రహ్మకుమారీల శాఖ ఇంచార్జ్ బి. కే.అంజలి బ్రహ్మకుమారీ అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు గత మూడు దశాబ్దాలుగా అహర్నిశలు కృషి చేస్తు,వారికి ఉజ్జ్వల భవిష్యత్తును అందిస్తున్న గృహ అధ్యక్షులు మార్గం రాజేష్ ను , ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ప్రముఖ సంఘ సేవకులను,అతిథులను ఉద్దేశించి,అంజలి బ్రహ్మకుమారి మాట్లాడుతూ, ప్రశాంత జీవనం కోసం సుఖ,శాంతి, ప్రేమ, ఆనందం కోసం రాజ యోగ ధ్యానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి, చేలాపుర బ్రహ్మకుమారి శాఖల ఇంచార్జీలు జయశ్రీ బ్రహ్మ కుమారి,రజనీ బ్రహ్మకుమారి , హైదరాబాద్ డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శ్రీనివాస్, హైదరాబాద్ సెంట్రల్ రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎంవిఆర్ మోహన్ హాజరైనారు.

## శ్రీ పద్మావతి కాలనీ నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు

* **అభినందించిన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి..**



హైదరాబాద్, అక్టోబర్ 27 (భారత శక్తి) : హయత్ నగర్ డివిజన్ లోని శ్రీ పద్మావతి కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డిని వారి నివాసంలో కలవడం జరిగింది, ఈ సందర్భంగా కార్పొరేటర్ పద్మావతి కాలనీ నూతన కార్యవర్గ సభ్యులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది.. అదే విధంగా శ్రీ పద్మావతి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కాలనీలో ఉన్నటువంటి పలు సమస్యలను కార్పొరేటర్ కి వివరించగా వారు స్పందించి సంబంధిత అధికారులతో సమీక్షించి వీలైనంత త్వరగా కాలనీవాసుల సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని, కాలనీ అభివృద్ధి పనులకు ఎల్లవేళల వారి సహాయ సహకారాలు ఉంటాయని తెలపడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో శ్రీ పద్మావతి కాలనీ నూతన కార్యవరం అధ్యక్షులు అంతటి అమర్నాథ్ గౌడ్, ఉపాధ్యక్షులు కందుల మధుభూపాల్ రెడ్డి, సెక్రటరీ సురకంటి జగన్ మోహన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ, కోశాదికారి టి.కృపాకర్ రావు, ఎన్. భాస్కర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు..

## డిజిపికి వినతిపత్రం అందజేసిన యుగ తులసి పార్టీ అధ్యక్షులు



హైదరాబాద్, అక్టోబర్ 27 (భారత శక్తి): తెలంగాణ డీజీపీ బి.శివధర్ రెడ్డిని కలిసి గో రక్షకుడు సోనూ సింగ్ పై జరిగిన కాల్పుల సంఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయవలసిందిగా విజ్ఞప్తి చేసిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభ్యర్థి, యుగ తులసి పార్టీ అధ్యక్షులు, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు కే. శివ కుమార్ రాబోయే బక్రీద్ కి గోవధ నివారణకు ఇప్పటి నుండే పటిష్టమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. జూబ్లీహిల్స్ లో ఎన్నికల ప్రచారంలో తనకు, యుగ తులసి పార్టీ ఎన్నికల ప్రచార రథానికి పూర్తి స్థాయిలో భద్రత కల్పించాల్సిందిగా కోరుతూ వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో కుప్పా శ్రీనివాస ప్రసాద్, జి. వినోద్ కుమార్ అడ్వకేట్, రామ్ కుమార్ జోషి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఏం.. మీరు న్యూస్ పేపర్లు చదవడంలేదా?... వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు ఫైర్

ఢిల్లీ, అక్టోబర్ 27 (భారత శక్తి) : వీధి కుక్కల నియంత్రణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము జారీ చేసిన ఆదేశాలను పాటించడంలో విఫలమైనందుకు పశ్చిమ బెంగాల్, తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు (ప్రధాన కార్యదర్శులు) సమన్లు జారీ చేసింది. వారంతా నవంబర్ 3న తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని సోమవారం ఆదేశించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) రూల్స్, 2023 అమలుపై తీసుకున్న చర్యలను వివరిస్తూ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఈ ఏడాది ఆగస్టులోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, చాలా రాష్ట్రాలు పట్టించుకోకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. "అధికారులు వార్తాపత్రికలు చదవడం లేదా? సోషల్ మీడియా చూడటం లేదా? ఆదేశాలు అందకపోయినా, అఫిడవిట్లు ఇక్కడ ఉండాల్సింది. నవంబర్ 3న చీఫ్ సెక్రటరీలందరూ తప్పనిసరిగా కోర్టులో హాజరు కావాలి" అని జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని బెంచ్ వ్యాఖ్యానించింది. పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రభుత్వాలతో పాటు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) మాత్రమే అఫిడవిట్లు దాఖలు చేశాయని కోర్టు గుర్తించింది. "దేశంలో వీధి కుక్కలకు సంబంధించిన ఘటనలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. దీనివల్ల విదేశాల దృష్టిలో మన దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. మేం కూడా వార్తా కథనాలను చదువుతున్నాం" అని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే సమయంలో, ఈ కేసులో తమను కూడా భాగస్వాములను చేయాలని కోరుతూ వివిధ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు, వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్లపై కూడా కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. "దేశంలోని RWAలన్నీ ఈ కేసులో పార్టీలుగా చేరతామంటే, మన ముందు కోట్లాది మంది ఉంటారు కదా? సహేతుకమైన సూచనలు చేయండి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణ తేదీన చీఫ్ సెక్రటరీలు హాజరు కాకపోతే, కఠిన చర్యలతో పాటు జరిమానాలు కూడా విధిస్తామని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఢిల్లీ విషయంలో ఎంసీడీ ఇచ్చిన నివేదిక సరిపోదని, అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయలేదో ఢిల్లీ చీఫ్ సెక్రటరీ వివరణ ఇవ్వాలని ఆదేశించింది. కాగా, ఆగస్టు 22న ఇచ్చిన ఆదేశాల ప్రకారం, కుక్కల స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కార్యక్రమాలతో పాటు, వాటి కోసం ఏర్పాటు చేసిన షెల్టర్ల వివరాలతో అన్ని రాష్ట్రాలు నివేదికలు సమర్పించాల్సి ఉంది. ఈ కేసు తదుపరి విచారణ నవంబర్ 3న జరగనుంది.

## కేటీఆర్ జాగ్రత్తగా ఉండాలని స్వయంగా కవితనే హెచ్చరించారు: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 27 (భారత శక్తి) : కాళేశ్వరం ప్రాజెక్టులో హరీశ్ రావు, సంతోష్ రావు దోచుకున్నారని, కేటీఆర్ జాగ్రత్తగా ఉండాలని స్వయంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. "కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి అంశంలో... రామన్నా జాగ్రత్త" అని కవితనే హెచ్చరించారని గుర్తు చేశారు. జూబ్లీహిల్స్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ ఐదు ముక్కలైందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన స్థాయికి తగిన వ్యక్తి కాదని విమర్శించారు. తాను మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడు ఆయన గుంటూరులో ఇంకా చదువుకుంటున్నాడని వ్యాఖ్యానించారు. పేదలకు సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన చేయని కేటీఆర్ గురించి మాట్లాడటం అనవసరమని అన్నారు.

*** బీఆర్ఎస్ ఓడిపోవడం ఖాయం: చామల కిరణ్ కుమార్ రెడ్డి**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడం ఖాయమని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి జోస్యం చెప్పారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి డిపాజిట్ కూడా దక్కలేదని అన్నారు. వరుస ఎన్నికల్లో ఓడిపోతే బీఆర్ఎస్ కనుమరుగవుతుందనే భయంతో హరీశ్ రావు, కేటీఆర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులపై కవిత అవినీతి ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. కవిత చేసిన ఆరోపణల ఆధారంగానే హరీశ్ రావు, కేటీఆర్‌లపై ఫిర్యాదు చేశామని అన్నారు.

## 6 వేల కుటుంబాలకు ఆరోగ్య భరోసా.. తిరుపతిలో ఆర్టీసీ కొత్త వైద్యశాల

తిరుపతి, అక్టోబర్ 27 (భారత శక్తి) : ఆర్టీసీ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. వారికి ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తిరుపతిలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన కొత్త వైద్యారోగ్య డిస్పెన్సరీని నిర్మించింది. పాత భవనం శిథిలావస్థకు చేరడంతో దాని స్థానంలో ఈ నూతన భవనాన్ని నిర్మించారు. ఈ నెల 30న ఈ డిస్పెన్సరీని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎండీ ద్వారకా తిరుమలరావు హాజరుకానున్నారు. ఈ కొత్త డిస్పెన్సరీ ద్వారా తిరుపతి జిల్లాలోని 11 డిపోల సిబ్బందితో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు కలిపి దాదాపు 6,000 కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి.

**ఆధునిక వసతులతో నిర్మాణం**

తిరుపతిలోని అలిపిరి డిపో సమీపంలో 1.3 ఎకరాల స్థలంలో రూ.3.89 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని జీ+3 అంతస్తుల్లో నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్కింగ్, మొదటి అంతస్తులో డిస్పెన్సరీ, రెండు, మూడు అంతస్తుల్లో గెస్ట్‌హౌస్ ఏర్పాటు చేశారు. వృద్ధులు, రోగుల సౌకర్యార్థం ప్రత్యేకంగా లిఫ్ట్‌ను కూడా అమర్చారు. ఒకేసారి 50 మందికి పైగా కూర్చునేలా విశాలమైన వెయిటింగ్ హాల్, ఫార్మసీ, ఓపీ కేంద్రం, వైద్యుల కోసం ప్రత్యేక గదులు వంటి సకల సౌకర్యాలు కల్పించారు.

*** ఉచిత మందులు, వైద్య పరీక్షలు**

ఇప్పటికే ఉన్న డిస్పెన్సరీ ద్వారా రోజుకు సుమారు 100 మందికి ఈసీజీతో పాటు, సెమీ ఆటోమోటివ్ ఎనలైజర్ ద్వారా 30 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. దీనితో పాటు నెలకు సుమారు రూ.3 లక్షల విలువైన మందులను ఉచితంగా అందిస్తున్నారు. ఈ సేవలన్నీ ఇకపై కొత్త డిస్పెన్సరీలో కూడా కొనసాగుతాయని అధికారులు తెలిపారు. కాగా, ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల ప్రమోషన్ల అంశంపై కూడా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

## హైదరాబాద్ శివార్లలో 100 ఎకరాల్లో భారీ గోశాల.. రూ. 157 కోట్లు మంజూరు

హైదరాబాద్, అక్టోబర్ 27 (భారత శక్తి) : తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద, అత్యంత ఆధునిక గోశాల నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి. హైదరాబాద్ నగరంలో నిరాదరణకు గురవుతున్న గోవులకు సురక్షిత ఆశ్రయం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎన్కేపల్లి గ్రామంలో 100 ఎకరాల సువిశాల ప్రభుత్వ భూమిలో దీనిని ఏర్పాటు చేయనున్నారు. ఈ నిర్మాణం కోసం ప్రభుత్వం ఇటీవల రూ. 157 కోట్లతో పాలనాపరమైన అనుమతులు మంజూరు చేయడంతో పనులు వేగవంతమయ్యాయి. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టును పర్యవేక్షిస్తోంది. ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు గోశాల నిర్మాణానికి కేటాయించిన భూమిని పూర్తిస్థాయిలో సర్వే చేసి, హద్దులు నిర్ణయించి హెచ్ఎండీఏకు అధికారికంగా అప్పగించారు. ప్రస్తుతం అధికారులు ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, టెండర్ల ప్రక్రియను ప్రారంభించారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే నిర్మాణ పనులు మొదలుకానున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఒక ముఖ్యమైన మానవతా దృక్పథాన్ని హెచ్ఎండీఏ ప్రదర్శించింది. గోశాలకు కేటాయించిన ప్రభుత్వ భూమిని గత కొన్నేళ్లుగా సుమారు 40 నిరుపేద కుటుంబాలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. గోశాల నిర్మాణం వల్ల తమ జీవనోపాధి దెబ్బతింటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన హెచ్ఎండీఏ అధికారులు వారితో చర్చలు జరిపి, ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపారు. ప్రతి కుటుంబానికి అదే ప్రాంతంలో 300 గజాల నివాస స్థలం కేటాయించడంతో పాటు కుటుంబంలో ఒకరికి గోశాలలోనే ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అధికారుల సానుకూల స్పందనతో సంతృప్తి చెందిన ఆ కుటుంబాలు భూమిని అప్పగించేందుకు అంగీకరించాయి. ఈ మెగా గోశాల నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ నగరంలో వేలాది గోవులకు సురక్షితమైన ఆశ్రయం లభించనుందని అధికారులు తెలిపారు.

## ఆధార్ కార్డుకు సంబంధించి నవంబర్ 1 నుంచి మారనున్న రూల్స్

ఢిల్లీ, అక్టోబర్ 27 (భారత శక్తి) : ఆధార్ కార్డులో మార్పులు చేసుకోవాలంటే ఉదయాన్నే ఆధార్ కేంద్రాలకు పరుగు పెట్టి, చాంతాడంత క్యూలో నిల్చుని టోకెన్ తీసుకుని పడిగాపులు కాస్తే తప్ప సాధ్యం కాదు. చిన్న చిన్న మార్పులకూ ఓ రోజు మొత్తం ఆధార్ కేంద్రంలోనే గడిచిపోతుంది. కొన్నిసార్లు రద్దీ ఎక్కువగా ఉండడం వల్ల మరుసటి రోజు కూడా పరుగులు పెట్టాల్సి వస్తుంది. ఇకపై ఈ ఇబ్బంది ఉండదని యూఐడీఏఐ తెలిపింది. ఆధార్ కార్డులో పేరు, పుట్టిన తేదీ, జెండర్, చిరునామా, మొబైల్ నెంబర్ వంటి వివరాల్లో మార్పులు చేర్పులు చేసుకోవడానికి ఆధార్ కేంద్రం దాకా వెళ్లాల్సిన అవసరం లేదని చెబుతోంది. నవంబర్ 1 నుంచి ఈ మార్పులను ఇంట్లో కూర్చుని ఆన్ లైన్ లో మీరే మార్చేసుకోవచ్చని తెలిపింది. ఈమేరకు సరికొత్త విధానాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొంది. ఆధార్ అప్‌డేట్ ప్రక్రియను మరింత వేగంగా, సురక్షితంగా మార్చడమే ఈ కొత్త ఆన్‌లైన్ విధానం లక్ష్యమని తెలిపింది. ఫింగర్ ప్రింట్స్, ఐరిస్ వంటి బయోమెట్రిక్ అప్‌డేట్స్ కోసం మాత్రం తప్పనిసరిగా ఆధార్ సేవా కేంద్రాన్ని సందర్శించాల్సిందేనని తెలిపింది. అయితే, ఆధార్ అప్ డేట్ కు సంబంధించిన ఫీజులు పెరిగాయి. పేరు, అడ్రస్ మార్పులకు రూ.75, బయోమెట్రిక్ మార్పులకు రూ.125 చెల్లించాల్సిందే. 15 ఏళ్లలోపు చిన్నారులకు బయోమెట్రిక్ మార్చేందుకు ఎలాంటి ఫీజు లేదని యూఐడీఏఐ పేర్కొంది.

## వాహనాలకు స్టార్ రేటింగ్... పిల్ తిరస్కరించిన సుప్రీంకోర్టు

ఢిల్లీ, అక్టోబర్ 27 (భారత శక్తి) : దేశంలో వాయు కాలుష్యాన్ని, దానివల్ల కలిగే ఆరోగ్య సమస్యలను తగ్గించేందుకు వాహనాలకు స్టార్ రేటింగ్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ అంశం పూర్తిగా ప్రభుత్వ పరిధిలోనిదని, ఇది విధానపరమైన నిర్ణయం కాబట్టి తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం నేడు ఈ పిటిషన్‌ను పరిశీలించింది. పిటిషనర్ తన వాదనలను నేరుగా కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం రూపంలో సమర్పించవచ్చని, ప్రభుత్వం దాని యోగ్యత ఆధారంగా పరిశీలిస్తుందని సూచించింది. "ఇది ప్రభుత్వ పరిధిలోని విషయం కాబట్టి, మేము జోక్యం చేసుకోవడానికి సుముఖంగా లేము" అని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. డాక్టర్ సంజయ్ కులశ్రేష్ఠ ఈ పిల్‌ను దాఖలు చేశారు. అభివృద్ధి చెందిన అనేక దేశాల్లో ఉన్నట్లుగా, వాహనాల కాలుష్య స్థాయిని బట్టి స్టార్ రేటింగ్ విధానాన్ని ప్రవేశపెడితే వినియోగదారులు పర్యావరణహితమైన వాహనాలను ఎంచుకునేందుకు వీలు కలుగుతుందని ఆయన వాదించారు. తద్వారా వాహన కాలుష్యాన్ని అరికట్టవచ్చని తెలిపారు. "భారత్‌లో రిఫ్రిజిరేటర్లు, ఏసీల వంటి గృహోపకరణాలకు ఎనర్జీ స్టార్ రేటింగ్ విధానం ఇప్పటికే ఉంది. మరి రోడ్లపై తిరుగుతూ ఇతరుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ఆటోమొబైల్స్‌కు ఎందుకు ఉండకూడదు? మన విలాసం ఇతరులకు సమస్యగా మారకూడదు" అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ రేటింగ్ విధానం పర్యావరణానికి మేలు చేసే కార్లను కొనుగోలు చేసేలా ప్రజలను ప్రోత్సహిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్‌లో 2021లో వాయు కాలుష్యం కారణంగా 21 లక్షల మరణాలు సంభవించాయని, వీటిలో 60 శాతం మరణాలకు వాహనాల నుంచి వెలువడే పీఎం2.5 కణాలే కారణమని పిటిషన్‌లో వివరించారు. ప్రముఖ వైద్య పత్రిక 'ది లాన్సెట్' అధ్యయనాన్ని ఉటంకిస్తూ.. ఢిల్లీ, బెంగళూరు, ముంబై వంటి ప్రధాన నగరాల్లో పీఎం2.5 కాలుష్యం కారణంగా ప్రతి సంవత్సరం సుమారు 33,000 మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే, ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్నప్పటికీ, ఇది ప్రభుత్వ విధానపరమైన అంశమని పేర్కొంటూ సుప్రీంకోర్టు పిటిషన్‌ను తిరస్కరించింది.



## జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఎన్నికల బరిలో 58 మంది అభ్యర్థులు..

*** ఇప్పటికే అభ్యర్థులకు గుర్తులు కేటాయించిన ఎన్నికల అధికారులు**

*** పోస్టల్ బ్యాలెట్ కోసం ఇప్పటి వరకూ 102 విజ్ఞాపనలు**

హైదరాబాద్, అక్టోబర్ 27 (భారత శక్తి) : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక బరిలో మొత్తం 58 మంది అభ్యర్థులు ఉన్నారు. నోటా తో కలుపుకొని మొత్తం 59 మంది ఉన్నారు. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి 3 అభ్యర్థులు పోటీ లో ఉండగా , రిజిస్టర్డ్ పొలిటికల్ పార్టీల నుంచి 26 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. కాగా మిగతా 29 మంది స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఇప్పటికే అభ్యర్థులకు అధికారులు గుర్తులు కేటాయించారు. నియోజకవర్గంలో మొత్తం 4,01,365 ఓటర్లు ఉండగా, ఈ ఉప ఎన్నిక కోసం 139 లొకేషన్ లలో మొత్తం 407 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఇప్పటి వరకూ 102 రిక్వెస్ట్ లు వచ్చాయి. అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఒక్కో పోలింగ్ కేంద్రానికి 4 బ్యాలెట్ యూనిట్ లను సీరీస్ శ్రేణిలో ఏర్పాటు చేసి కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్ మెషిన్ ను అనుసంధానిస్తారు. మొత్తం కంట్రోల్ యూనిట్ లు 569 , బ్యాలెట్ యూనిట్ లు 2,442 , వీవీప్యాట్ లు 610 ఉపయోగించనున్నారు. ఎన్నిక ప్రక్రియ సజావుగా జరిగేలా ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## తుపాను బాధితులకు రూ.3 వేలు, 25 కిలోల బియ్యం

అమరావతి, అక్టోబర్ 27 (భారత శక్తి) :రాష్ట్రం వైపు వేగంగా కదులుతున్న 'మొంథా' తుపాను నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తుపాను సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సహాయక చర్యల్లో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని, ప్రజలకు అండగా నిలవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. తుపాను కారణంగా ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న ప్రతి కుటుంబానికి తక్షణ సాయంగా రూ.3,000 అందించాలని ఆదేశించారు. దీంతో పాటు, ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, వైద్య శిబిరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాల్లో అత్యవసర వైద్య సేవలు అందించే సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం మనం చేపడుతున్న సహాయక చర్యలు భవిష్యత్తులో వచ్చే తుపానులను ఎదుర్కోవడానికి ఒక రోల్ మోడల్‌గా నిలవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.




మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం విగ్నేష్ రెడ్డి తండ్రి గుర్రం మల్లారెడ్డి మృతి చెందడంతో మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి. మార్కెట్ కమిటి డైరెక్టర్ పన్నాల రాజేందర్ రెడ్డి, గడ్డం లింగారెడ్డి తదితరులు మాజీ మేయర్ వెంట ఉన్నారు.

బడంగ్‌పేట్, అక్టోబర్ 27 (భారత శక్తి ):

# ఎల్బీనగర్లో ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీ..

**ఈ ప్రాంతం తెలంగాణ రాష్ట్రంలో నలుమూలల నుంచి సులువుగా చేరుకోగల ప్రాంతం.. తగిన రవాణా సౌకర్యం కలిగి ఉంది.. అలాగే ఇక్కడ అన్ని వసతులు లభిస్తాయి.. అన్ని ప్రాంతాల వారు అన్ని భాషలవారు ఇక్కడ నివసిస్తూ ఉన్నారు.. అదే ఎల్బీనగర్ నియోజకవర్గ ప్రాంతం.. ఇక్కడ ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు కార్పొరేట్ ప్రైవేట్ ఆసుపత్రులు చాలానే నెలకొని ఉన్నాయి.. అందువల్ల రాష్ట్రంలోని నలుమూలల నుంచి ఎంతోమంది వైద్యం కొరకు ఎల్బీనగర్కు వస్తూ ఉంటారు.. ఇంతవరకు బాగానే ఉంది కానీ ఇక్కడ కార్పొరేట్ ప్రైవేట్ ఆసుపత్రులు విపరీతమైన దోపిడీకి తెరతీసాయి.. తమ వద్దకు వచ్చే రోగులను బ్రతికించే ప్రక్రియను పక్కనపెట్టి కేవలం వారి నుంచి దోచుకోవడమే తమ ఎజెండాగా మార్చుకున్నాయి ఇక్కడి ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులు.. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ సరైన వైద్యం అందించక ఎన్నెన్నో ప్రాణాలను తీసిన సంఘటనలు అనేకం వెలుగు చూశాయి.. బాధితులతో సెటిల్మెంట్లు చేసుకుంటూ ఈ ఆసుపత్రుల యాజమాన్యాలు కర్కశంగా ప్రవర్తిస్తూ ఉన్నాయి.. మరింత దుర్మార్గం ఏమిటంటే ఇక్కడి ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు ప్రభుత్వ ఆరోగ్యశాఖ అధికారులు వీరితో పాటు జిహెచ్ఎంసి అధికారులు కూడా కుమ్మక్కై వారి దోపిడికి సహకరిస్తున్నారు.. ఈ దోపిడిపై యుద్ధాన్ని ప్రకటిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..**

- **సరైన నియంత్రణ లేకపోవడంతో రెచ్చిపోతున్న వైనం..**
- **లంచాలకు బానిసలై పోతున్న ఆరోగ్యశాఖ అధికారులు..**
- **వీరికి వంత పాడుతున్న జిహెచ్ఎంసి అవినీతి అధికారులు..**
- **అనుమతులు లేకుండా నడుస్తున్న ఎన్నెన్నో ఆసుపత్రులు..**
- **ఎలాంటి సేఫ్టీ ప్రికాషన్స్ లేకుండానే ఆసుపత్రుల నిర్వహణ..**
- **ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ ఇష్టానుసారం భారీ ఫీజులు వసూలు చేస్తున్న దుర్మార్గం..**
- **అక్రమ నిర్మాణాలలో, భవంతుల్లో నిర్వహిస్తున్న ఆసుపత్రులు..**
- **కేవలం దోపిడీయే తమ ఎజెండాగా సాగిపోతున్న ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు...**
- **ప్రాణాలు పోయినవారికి సైతం వైద్యం నిర్వహిస్తున్నామని లక్షల్లో దోచుకున్న ఉదంతాలు ఎన్నెన్నో..**
- **ఈ దోపిడిపై యుద్ధాన్ని ప్రకటిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..**




**(స్పెషల్ కరస్పాండెంట్)**

**హైదరాబాద్, అక్టోబర్ 27 (భారత శక్తి) :**

ఎల్బీనగర్ నియోజకవర్గంలో అలాగే హైదరాబాద్ నగరంలోని చాలా ప్రాంతాల్లో ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీ, అధిక ఫీజులు, అవసరం లేని పరీక్షలు, బిల్లులలో పారదర్శకత లేకపోవడం వంటి సమస్యలు నిజంగా ప్రజలకు భారంగా మారాయి. మరీ ముఖ్యంగా ఎల్బీనగర్ లోని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు బరితెగించి పోతున్నడం దురదృష్టకరం.. మరి ఇక్కడ ప్రభుత్వ అధికారులు పనిచేస్తున్నారా జిహెచ్ఎంసి అధికారులు ఏమి చేస్తున్నారు అర్థం కాని పరిస్థితి నెలకొని ఉంది.. అక్రమంగా నిర్మించిన భవంతుల్లో ఆసుపత్రుల నిర్వహణ. ఎలాంటి సేఫ్టీ ప్రికాషన్స్ లేకుండా ఆసుపత్రులు నడుస్తూ ఉన్నాయి.. ఒకటి కాదు రెండు కాదు చాలా ఆసుపత్రులు ఇలాగే నడుస్తూ ఉన్నాయి.. వీటిపై కొరడా దులిపించాల్సిన ఆరోగ్యశాఖ అధికారులు లంచాలకు మరిగి నిద్రబోతున్నారు.. వీరికి తోడు జిహెచ్ఎంసి అధికారులు కూడా తోడయ్యారు.. దీంతో తమ ప్రాణాలను రక్షించుకోవడానికి ఆసుపత్రులకు వస్తున్న రోగులు డబ్బులు చెల్లిస్తూ ప్రాణాలు కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడింది.. వైద్యో నారాయణో హరి అంటారు.. కానీ ఇక్కడి ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చి అందరూ హరి అని పైకి పోతున్నారు..

**ప్రైవేట్ ఆసుపత్రుల ఆధిపత్యం:**

ప్రభుత్వ ఆసుపత్రులు తక్కువ సంఖ్యలో ఉండటం, పరికరాల కొరత, సిబ్బంది కొరత కారణంగా ఎక్కువమంది ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

**అధిక బిల్లులు:**

చిన్న చిన్న చికిత్సలకు కూడా వేలల్లో, లక్షల్లో బిల్లులు చెల్లించాల్సిన దుర్భర పరిస్థితి నెలకొని ఉంది.. నిస్సిగ్గుగా ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు బిల్లులు తమకు నచ్చినట్లు వేస్తున్నారు.. మధ్యతరగతి పేద ప్రజలు ఆసుపత్రుల బిల్లుల కొరకు తమ ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.. ఇంత కష్టపడి బిల్లులు చెల్లించినా తమ వారి ప్రాణాలు దక్కుతాయనే నమ్మకం లేకుండా పోతోంది..




కేవలం బిల్లుల మీద మాత్రమే ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు డాక్టర్లు దృష్టిని పెడుతున్నారు. వీరికి రోగుల ప్రాణాలంటే లెక్క లేకుండా పోతోంది..

**ప్రభుత్వ నిర్లక్ష్యం:**

ఆరోగ్య శాఖ, జిల్లా వైద్యాధికారులు ఆసుపత్రులపై నిరంతర తనిఖీలు చేయకపోవడం వల్ల ఈ దోపిడీ కొనసాగుతోంది. ఎందుకంటే నెల నెల వీరికి లక్షల్లో ముడుపులు అందుతున్నాయి కాబట్టి నిమ్మకుండి పోతున్నారు.. రేపటి రోజున వీరికి వీరి కుటుంబ సభ్యులకు ఏదైనా అనారోగ్య సమస్య ఎదురైతే అప్పుడు తెలుస్తుంది.. కనీసం ఈ నిజాన్ని గ్రహించలేకపోతున్నారు అధికారులు..

**ఆరోగ్య బీమా సమస్యలు:**


చాలా ప్రైవేట్ ఆసుపత్రులు ఆరోగ్య బీమా అంటే ఆరోగ్యశ్రీ లేదా ఇతర పథకాలను అంగీకరించకపోవడం లేదా రోగులను అవగాహన లేకుండా మోసం చేయడం జరుగుతోంది. దీనిపై ఆరోగ్య శాఖ అధికారులు గానీ జిహెచ్ఎంసి అధికారులు గానీ ప్రజలకు సరైన అవగాహన కల్పించడంలో విఫలం అవుతున్నారు..

**ప్రజల పరిస్థితి :**

మధ్యతరగతి, పేద వర్గాలు అప్పులు చేసి చికిత్స చేయించుకుంటున్నారు.

రోగి కంటే బిల్లు చూసి ప్రజలు భయపడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల లేమి వల్ల వారు మళ్లీ ప్రైవేట్ వైపు మళ్లాల్సి వస్తోంది.

అవసరం లేకపోయినా పరీక్షలు చేయించుకోవాలని చెప్పడం.. అలాగే ఆపరేషన్లు చేయకపోతే రోగి బ్రతకడు అని భయపెట్టడం.. రోగి కుటుంబ సభ్యుల నుంచి లక్షల్లో ఫీజులు వసూలు చేయడం ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిరంతరం కొనసాగుతూనే ఉంది.. మరి నీచమైన విషయం ఏమిటంటే అర్హత లేని వారు కూడా ఈ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు అందిస్తున్నారు.. రేడియేషన్ స్పెషలిస్ట్ ఆపరేషన్లు చేసేస్తున్నారు.. నర్సులు వైద్యం చేసేస్తున్నారు.. ఇలా ఆపరేషన్లు చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన ఉదంతాలు అనేక అనేకం చూసాం.. తీరా రోగి ప్రాణాలు పోయాక తమను తాను రక్షించుకోవడానికి ఆసుపత్రిని రక్షించుకోవడానికి అధికారులు పోలీసుల సహకారంతో కుటుంబ సభ్యులను మేనేజ్ చేస్తూ అంతో ఇంతో డబ్బులు చెల్లిస్తూ ఆ కేసును వెలుగు చూడకుండా చేస్తున్నారు..



అసలు ఇదంతా ఎలా జరుగుతోంది కేవలం ప్రభుత్వ వైఫల్యమే కదా.. సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే కదా.. వీరందరి ధన దాహమే కదా.. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలి..

**పరిష్కారాలు :**

ప్రైవేట్ ఆసుపత్రులపై నియంత్రణ బోర్డు, అంటే రెగ్యులేటరీ అథారిటీని శక్తివంతం చేయాలి నిరంతరం పనిచేసేలా చూడాలి..

ప్రతి ఆసుపత్రి టారిఫ్ లిస్ట్ పబ్లిక్‌గా ప్రదర్శించాలి. ఈ లిస్ట్ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉందా లేదా చూసుకోవాలి..

హెల్త్ హెల్ప్‌లైన్.. 24/7 గ్రీవెన్స్ సెల్ ఆక్టివ్ గా ఉండేలా చూడాలి..

ఆరోగ్యశ్రీ లాంటి అత్యుత్తమ పథకాలను అన్ని ఆసుపత్రుల్లో తప్పనిసరిగా అమలు చేయాలి. వీటన్నిటి కంటే ముఖ్యంగా ఎల్బీనగర్లో ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి.. ఆ ఆసుపత్రి నిర్వహణ పటిష్టంగా అమలు చేయాలి.. ప్రైవేటు కార్పోరేటు ఆసుపత్రులపై ఉక్కు పాదం మోపగలగాలి.. అప్పుడే కొంతవరకైనా సమస్యలు పరిష్కరించబడతాయని భావిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "

ఈ క్రమంలో సాధారణ ప్రజానీకం కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలి..

బిల్లులు, చికిత్స వివరాలు రాతపూర్వకంగా తీసుకోవాలి.

మోసం జరిగితే జిల్లా ఆరోగ్య అధికారులకు లేదా కస్టమర్ కోర్టుకు ఫిర్యాదు చేయాలి.


సోషల్ మీడియా, మెయిన్ స్ట్రీమ్ మీడియా ద్వారా దోపిడీ ఉదంతాలను బయటపెట్టాలి.

*** సామాజిక అవగాహన ముఖ్యమైన ప్రక్రియ :**

ఎన్ జి ఓ లు, స్థానిక సంఘాలు ఆరోగ్య హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించాలి.

"హెల్త్ ఫర్ ఆల్" అనే ప్రజా ఉద్యమం అవసరం అని భావిస్తోంది ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగిస్తోంది " ఫోరమ్ ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "




# మంచినీటి సరస్సు మాయం

- **మంచినీటి సరస్సు మాయం**
- **ఆనవాళ్లు కోల్పోతున్న బుల్కాపూర్ నాలా..!**
- **నిజాం కాలంలో ప్రజల దాహార్తిని తీర్చిన మహత్తర కాలువ**
- **నేడు కబ్జాదారుల చెరలో?**



రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 27 (భారత్ శక్తి) : హైదరాబాద్ రాష్ట్రాన్ని పరిపాలించిన నిజాం నవాబులు ప్రజల తాగు, సాగు నీటి అవసరాల కోసం అనేక చెరువులు తవ్వించారు. అయితే వికారాబాద్ అనంతగిరి కొండల్లో జీవం పోసుకున్న ముచ్కుంద నది వరదలు 1908లో వరదలు ఓటెత్తడంతో హైదరాబాద్ నగరాన్ని ముంచెత్తింది. ఈ వరదల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయాలు అయ్యారు. దీంతో హైదరాబాద్ రాష్ట్రాన్ని పాలిస్తున్న 6వ నిజాం నవాబు మీరు మహబూబ్ అలీ ఖాన్ చలించిపోయాడు. వెంటనే ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య తో ముచుకుందా నది కట్టడి చేయడానికి రెండు నదులను నిర్మించాడు. అవే హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ (గండిపేట్) లను నిర్మించాడు. ఈ రెండు నదులను తన రాజ్యంలోని ప్రజల దాహార్తిని తీర్చేందుకు మంచినీటి వనరుగా ఉపయోగించాడు. అయితే కార్యక్రమం లో ఈ నదులు ఉప్పొంగి ప్రవహించడంతో కింద మరో సరస్సు నిర్మించాడు. అదే హుస్సేన్ సాగర్. ఈ హుస్సేన్ సార్ ను కూడా ప్రజల మంచినీటి అవసరాల కోసం వినియోగించాడు. గండిపేట్ నుండి అలుగు భారీ వచ్చే వరద నీటిని హుస్సేన్ సాగర్ లో కలపడం కోసం బుల్కాపూర్ నాలాను నిర్మించాడు. ఈ నాలా గొలుసు కట్టు చెరువుల్లో భాగమైన ఖాజాగూడ చెరువు లోకి వర్షనీటిని చేరుస్తుంది. అక్కడి నుండి మణికొండ చెరువు, అది నిండితే షేక్ చెరువులోకి వెళ్తుంది. షేక్ పేట్ చెరువు నిండితే అలుగుద్వారా అదే బుల్కాపూర్ నాలాగుండా హుస్సేన్ సాగర్ లో కలుస్తుంది. ఇవన్నీ నాటి 6వ నిజాం ప్రజల దాహార్తి కోసం నిర్మించిన మంచినీటి సరస్సులు.





*** కనుమరుగు అవుతున్న బుల్కాపూర్ నాలా..!**

హైదరాబాద్ నగర ప్రజల నేటి తరానికి బుల్కాపూర్ నాలా గురించి తెలియదు. కానీ బుల్కాపూర్ నాలా చాలా చారిత్రకమైనది.. ప్రాచీనమైనది. గండిపేట్ నుండి హుస్సేన్ సాగర్ వరకు ఈ నాలా ద్వారా తాగునీరు ప్రవహించేది. కానీ ఆధునిక మోడలైజేషన్లు.. అధికారుల అలసత్వంతో చారిత్రక చరిత్ర కలిగిన నాలా కనుమరుగు అవుతుంది.

*** అధికారుల అలసత్వం.. అనేకం..?**

గండిపేట్ ఖానాపూర్ నుండి ఖాజా గూడా, మణికొండ నుండి షేక్ పేట్ వరకు నగరీకరణ అత్యంత వేగంగా అభివృద్ధి చెందింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోట్లలో పెరిగింది. దీంతో రియల్ గద్దల కన్నులు నాలాలను కూడా వదలడం లేదు. ఒకప్పుడు మంచినీటి సరస్సు గా పేరొందిన బుల్కాపూర్ నాలా సైతం కబ్జా చేరాల్లో చిక్కుకుంది. ఈ నాలా వెంబడి నాలా పైనే అనేక చోట్ల బహుళ అంతస్తులు (హై రైస్ బిల్డింగ్స్) నిబంధనలకు విరుద్ధంగా ఏర్పడ్డాయి. అధికారుల చేతిలో బరువు బుల్కాపూర్ నాలా ముంగిట సరితూగలేకపోయింది. దీంతో ఎక్కడపడితే అక్కడ నాలా కబ్జాల గురవుతుంది. ఇది భవిష్యత్తు తరాలకు ముప్పుగా మారింది. ఒకనాడు ప్రజల దాహార్తిని తీర్చిన బుల్కాపూర్ నాలా కబ్జా గురి కావడంతో ఖాజా గూడా మణికొండ షేక పెట్ లోని అనేక కాలనీలో వరద ముంపుకు గురవుతున్నాయి. వీటికి కారకులు ఎవరు..?

(పూర్తి వివరాలు మరొక కథనంలో..)

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.